PRGI Reg No -"APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...

ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 159, సంపాదకులు : గొంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 29 - జూలై - 2026 , వెల రూ.5/-



## మంత్రి నారా లోకేశ్‌కు పేర్ని నాని బహిరంగ సవాల్

- డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న పేర్ని నాని
- డీఎస్సీ అవకతవకలపై చర్చకు రావాలని లోకేశ్ కు సవాల్
- చంద్రబాబు వస్తే చర్చకు జగన్ వస్తారని వ్యాఖ్య

**అమరావతి :**

డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియలో భారీ అక్రమాలు జరిగాయంటూ మంత్రి నారా లోకేశ్ పై మాజీ మంత్రి, వైసీపీ నేత పేర్ని నాని తీవ్రస్థాయిలో - మిగతా 2 లో

# అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం



- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- దేశంలోనే తొలిసారిగా అమరావతిలో ప్రెసిషన్ ఆంకాలజీ క్యాన్సర్ సెంటర్
- ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా ఒప్పందం
- ఏపీ ప్రభుత్వంతో ఆస్ట్రాజెనెకా, ఇతర దిగ్గజ సంస్థల ఒప్పందం
- అమరావతిలో ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్ ఏర్పాటు

**అమరావతి :**

ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య రంగంలో మరో కీలక ముందడుగు పడింది. అంతర్జాతీయ ఫార్మా, బయోటెక్ దిగ్గజ సంస్థలైన ఆస్ట్రాజెనెకా, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్, క్యూర్ ఏఐ సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఈ ఒప్పందాలు జరిగాయి. ఈ ఒప్పందంలో భాగంగా, అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి ఇంటిగ్రేటెడ్ ప్రెసిషన్ ఆంకాలజీ విధానాన్ని ప్రారంభించనున్నారు. ఈ ఒప్పందం ప్రకారం ఆస్ట్రాజెనెకా ఇండియా, అమరావతిలో 'ఇంటిగ్రేటెడ్ జెనోమిక్ సొల్యూషన్స్ సెంటర్'ను ఏర్పాటు చేయనుంది. ఈ కేంద్రం ద్వారా ముఖ్యంగా ఊపిరితిత్తులు, రొమ్ము కేన్సర్ రోగులకు అవసరమైన అధునాతన జన్యు పరీక్షలు, బయోమార్కర్ టెస్టింగ్ సేవలను అందిస్తారు. దీనివల్ల కేన్సర్ చికిత్సలో కచ్చితమైన, వేగవంతమైన ఫలితాలు సాధించేందుకు వీలు కలుగుతుంది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, రాష్ట్ర - మిగతా 2 లో

# జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ



- శ్రీశైలం డ్యామ్ కు పెరుగుతున్న వరద ప్రవాహం
- కృష్ణానది ఎగువన కురుస్తున్న కుండపోత వర్షాలు
- జూరాల ప్రాజెక్టుకు 32 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- క్రస్ట్ గేట్లు ఎత్తేసిన అధికారులు.. శ్రీశైలం జలాశయానికి వరద

**అమరావతి :**

రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎల్ నినో ప్రభావం కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అయినప్పటికీ కృష్ణానది మాత్రం జలకళను సంతరించుకుంటోంది. కృష్ణా నది ఎగువ పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న కుండపోత వర్షాలతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద ఉధృతి గణనీయంగా పెరిగింది. వారం రోజులుగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్ణాటక పరీవాహక ప్రాంతాల్లో



## జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

- సునామీ హెచ్చరిక జారీ
- జపాన్‌లోని కుమమోటోలో 7.1 తీవ్రతతో భారీ భూకంపం
- క్యుషు ద్వీపంలోని కుమమోటో సమీపంలో భూకంప కేంద్రం
- తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరిక

**ఢిల్లీ :**

జపాన్‌లోని దక్షిణ ప్రాంతాన్ని మంగళవారం మధ్యాహ్నం భారీ భూకంపం వణికించింది. క్యుషు ద్వీపంలోని కుమమోటో ప్రిఫెక్చర్‌లో రిక్టర్ స్కేలుపై 7.1 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. దీంతో జపాన్ వాతావరణ సంస్థ వెంటనే తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేసింది. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం ఈ భూకంపం సంభవించినట్లు అధికారులు వెల్లడించారు. కుమమోటో నగర సమీప ప్రాంతం కేంద్రంగా, భూమికి 10 కిలోమీటర్ల లోతులో ప్రకంపనలు నమోదయ్యాయి. అరియాకే, - మిగతా 2 లో

# నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు



- విద్యార్థుల ఆందోళనలపై సుప్రీం కీలక ఆదేశాలు
- విద్యార్థుల ఆందోళనలపై సిట్ కు దిశానిర్దేశం
- అదుపులో ఉన్న మైనర్లను విడుదల చేయాలని ఆదేశం
- ఎలక్ట్రానిక్ ఆధారాలు భద్రపరచాలని సూచన
- కేంద్రం, ఏడు రాష్ట్రాలకు నోటీసులు

**ఢిల్లీ :**

నీట్-యూజీ 2026 ప్రశ్నపత్రం లీక్ ఆరోపణలపై దేశవ్యాప్తంగా జరిగిన విద్యార్థుల ఆందోళనల సందర్భంగా పోలీసుల బలప్రయోగం, పోలీసులపై జరిగిన దాడులపై స్వతంత్ర దర్యాప్తు అవసరమని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఈ వ్యవహారంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపింది. అలాగే నేర చరిత్ర లేని విద్యార్థి నిరసనకారులపై తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు - మిగతా 2 లో

## అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్

- కనీసం 20 మంది మృతి, పలువురికి గాయాలు
- పీఓకేలో లాంగ్ మార్చ్ సందర్భంగా హింస
- చర్చలు విఫలమవడంతో జేఏఏసీ ఆందోళన
- నిరసనకారులపై కాల్పుల ఆరోపణలు



**ఢిల్లీ :**

పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. 'జాయింట్ అవామీ యాక్షన్ కమిటీ (జేఏఏసీ)' చేపట్టిన లాంగ్ మార్చ్ సందర్భంగా జరిగిన హింసలో కనీసం 20 మంది మృతి చెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉంది. దీంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం. జేఏఏసీ - మిగతా 2 లో

ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది

## ప్రభుత్వ విచక్షణాధికారం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- హైడ్రా కమిషనర్‌ను తప్పించాలన్న హైకోర్టు
- ఘాటుగా స్పందించిన రేవంత్ రెడ్డి
- హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను తొలగించాలన్న హైకోర్టు ఆదేశాలను సమీక్షిస్తామన్న సీఎం



**హైదరాబాద్ :**

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌ను తక్షణం విధుల నుంచి తప్పించాలంటూ హైకోర్టు వెలువరించిన - మిగతా 2 లో

మేం ఎవరికి ఏం అమ్మాలో

## ఎవరూ చెప్పనక్కర్లేదు

- టర్కీకి ఎఫ్-35 విమానాల విక్రయంపై నెతన్యాహుకు ట్రంప్ షాక్
- టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై నెతన్యాహు అభ్యంతరం
- టర్కీ తమకు నమ్మకమైన భాగస్వామి అన్న ట్రంప్



**ఢిల్లీ :**

టర్కీకి ఎఫ్-35 ఫైటర్ జెట్లను విక్రయించడంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ - మిగతా 2 లో



శివరాజ్ సింగ్ చౌహాన్ తో

## రేవంత్ రెడ్డి భేటీ

- 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని విన్నపం
- గత ప్రభుత్వ హయాంలో గృహనిర్మాణ రంగం నిర్లక్ష్యానికి గురైందని కేంద్ర మంత్రికి తెలిపిన రేవంత్
- ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చాలని విన్నపం
- గ్రామీణ కుటుంబాలను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకాన్ని విస్తరించాలన్న సీఎం

**హైదరాబాద్ :**

ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో ప్రత్యేకంగా - మిగతా 2 లో

# ప్రతి సంవత్సరం ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి
- మీడియాతో మాట్లాడిన సీఎం
- యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపణ
- కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై



**హైదరాబాద్ :**

ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ,, ఆఫ్‌లైన్‌లో పరీక్షల నిర్వహణ వల్ల సమస్యలు ఎక్కువ వస్తున్నాయని తెలిపారు. బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం చేస్తోందని, యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోందని ఆరోపించారు. విద్య, వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయని తెలిపారు. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై ఆలోచిస్తామని సీఎం తెలిపారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టామని, రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించామని గుర్తు చేశారు. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందని, గ్లోబరీనా వంటి సంస్థలు నాడు తెలంగాణలో అక్రమాలకు పాల్పడ్డాయని, నాటి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వల్ల సీబీఎస్ఈకి విస్తరించారని, - మిగతా 2 లో

# తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు
- తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం అవుతోందన్న రాంచందర్ రావు
- చదువుకున్న యువత పార్టీలో చేరుతున్నారని వెల్లడి
- సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వ్యాఖ్య

హైదరాబాద్ :

తెలంగాణలో రాబోయే రోజుల్లో బీజేపీ నేతృత్వంలో 'డబుల్ ఇంజిన్ ప్రభుత్వం' ఏర్పాటు కావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు ధీమా వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దక్షిణ తెలంగాణలో బీజేపీ క్రమంగా బలోపేతం కావడం శు భపరిణామమని, చదువుకున్న యువత పెద్ద సంఖ్యలో పార్టీలోకి చేరుతుండటం మార్పుకు సంకేతమని పేర్కొన్నారు. సనాతన ధర్మాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్న ఆయన... అనేక దేశాలు క్రిస్టియన్, ముస్లిం దేశాలుగా మారినా సనాతన ధర్మాన్ని ఏ శక్తీ నిర్మూలించలేక పోయిందని అన్నారు. ప్రస్తుతం యువజన ఉద్యమాల - మిగతా 2 లో



# సంపాదకీయం

## వాఘా.. గుండెలు ఉప్పొంగలేదు!



చిన్నప్పటి నుంచి మన దేశ సరిహద్దుల గురించి వినీ చదివీ ఒక చరిత్ర విద్యార్థిగా ఉప్పొంగిపోయాను. ఉత్తరాన హిమాలయాలు మంచుతో నిండివుంటాయనీ-- కైబర్, బోలాన్ కనుమల గుండా ఇతర ప్రాంతాల నుంచి మన దేశంలోకి శతాబ్దాలుగా మానవ సంచారం జరిగిందని చదువుకుని, మాకు మేమే ఉత్తేజితులమయ్యాం. బౌద్ధ భిక్షువులే కాక హర్షుడి కాలం నుంచి హుయన్‌త్సాంగ్, అలెగ్జాండర్, రాహుల్ సాంకృత్యాయన్ వంటి ఎందరో మహనీయులు మానవ నాగరికతకు, సంస్కృతికి, చరిత్రకు వారధి కట్టారు. అదంతా మనసులో నిండివుండడంతో డెబ్బై మూడేళ్ల వయసులో పదిమందితో కలిసి హిమాలయాల సందర్శనానికి సాహసంతోనే బయలుదేరాం. వారిలో సగంమంది అరవైలు దాటినవాళ్లు. మిగిలినవాళు యాభైలలో ఉన్న యువకులు.ఇదంతా దేనికంటే-- ఈ వయసులో శ్రీనగర్ నుంచి లేహ్ మీదుగా నుబ్రావాలి, కృతుంగాపాస్, పాన్‌గాంగ్ సరస్సుదాకా ఆక్సిజన్ లెవల్స్‌తో ఇబ్బంది పడతామని తెలిసి కూడా సాహసించాం. పాన్‌గాంగ్ (చైనా సరిహద్దు) నుంచి కార్గిల్ (పాకిస్థాన్ సరిహద్దు) దాకా ప్రయాణించి అద్భుతమైన పర్వతాలను, మరోవైపు దిగంతాలను తలపించే లోయలను చూస్తూ-- ప్రమాదభరితమని తెలిసినా సంతోషంగా గడిపాం.ఇంత ఆనందంలో చివరి రోజు, చివరి ఘట్టం ఎంత దిగులుగా, నిరాశగా, నిస్పృహగా మిగిలిందంటే-- మా పదిహేను రోజుల యాత్రను నీరసపరిచింది. భారతీయులుగా 'వాఘా' సరిహద్దు సైనిక కవాతు చూడడం నిజంగా గర్వకారణం. మేమంతా ఎప్పటినుంచో ఆ బోర్డర్‌లో ప్రదర్శించే సైనిక కవాతు గురించి వినివున్నాం. నెట్‌లో చూసి కూడా ఎంతో ఉత్తేజితులం అయివున్నాం. అయితే మేము వెళ్లినరోజు అక్కడి ప్రదర్శన మాకు అత్యంత నిరాశను కలిగించింది. ఈ నెల తొమ్మిదో తేదీ అయిదు గంటలకల్లా ఆగమేఘాల మీద అక్కడికి చేరుకున్నాం. ఆ వేల మందిలో కూర్చునే చోటు దక్కించుకుని ప్రదర్శన కోసం ఉత్కంఠతో ఎదురుచూస్తున్నాం. అయిదున్నరకు ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు, ఆరున్నరకు గానీ ప్రారంభం కాలేదు. అది కూడా ఎంత నిరాశ కలిగించిందో చెప్పలేం. అయిదున్నరకు సందర్శకుల నుంచి-- మహిళలను ప్రదర్శన జరిగే చోటుకు పిలిచారు. వారితో జాతీయ జెండా ప్రదర్శింపజేశారు. అంతవరకే అయితే ఫరవాలేదు. కానీ దేశభక్తితో కూడిన పాటలు పెట్టి మహిళలతో చేతులు ఊపుతూ ప్రదర్శన చేయించారు. అదీ పోనీ అనుకుంటే-- ఈ చేరిన మహిళలు ఆ కవాతు జరిగే ప్రదేశంలో బతుకమ్మలాడారు. కొందరైతే చేతులు పట్టుకుని 'ఒప్పుల కుప్ప' ఆడారు. అది చూస్తూ మాకు ఎంత ఆవేదన కలిగిందో చెప్పలేం.మహిళలను ప్రతి దానిలో భాగం చేయాలనే కాంక్ష కొద్దీ ఈ మధ్య రథయాత్రలు, దేవుడి ఊరేగింపుల ముందు, కోలాటాలూ వేయించడం-- ఇది ఏ సంస్కృతో తెలియదుగానీ దిగువ మధ్యతరగతి స్త్రీలు ఈ ప్రదర్శనలకు ఆలంబన కావడం దురదృష్టం. గుడిలో పూజాకైంకర్యాలు చేసే దేవదాసీలను నిషేధించి-- వీధి ఊరేగింపుల్లో భక్తి పేరుతో ఎందుకు వీరిని తెస్తున్నారో అర్థం కావడం లేదు. దానినే సహించలేని సమాజికులుగా 'వాఘా' బోర్డర్ సైనిక కవాతు సందర్భంగా కూడా మహిళలను ఆ ట్రాక్‌లోకి ఆహ్వానించి ప్రదర్శనను ఇంత పేలవంగా, అగౌరవంగా జరపడం శోచనీయంగా భావిస్తున్నాం. చివరికి నెట్‌లో చూసినపాటి ప్రదర్శన కూడా లేకుండా సైనిక కవాతు ముగించారు. బోర్డర్ గేట్లు తీయడం లేదు. ఇరువైపుల సైనికుల కరచాలనం లేదు. ఇదంతా అనకూడదుగానీ ఏదో విన్యాసం కింద తయారయింది.భారతీయ పౌరులందరికీ దేశభక్తి ఎంతో మహోన్నతమైనది. ఆ మాట తలుచుకుంటే గుండెలు ఉప్పొంగుతాయి. దానికి ప్రతీక అయిన 'వాఘా బోర్డర్' కవాతును ఆ రోజు అలా చూడటం నాకు ఎంతో బాధాకరంగా అనిపించింది. ఇప్పటికైనా ప్రభుత్వం దీనిని సరిదిద్దుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను.

## అందరికీ ఆధునిక వైద్యం అందించడమే లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి** - ప్రజలందరికీ అందుబాటు ధరల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలు తీసుకురావడమే ఈ ఒప్పందం లక్ష్యమని పేర్కొన్నారు. కేవలం వైద్య సేవలే కాకుండా, ఫార్మా, బయోటెక్నాలజీ రంగాల్లో క్వాంటం స్థాయి పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన సూచించారు. ఈ ఒప్పందంతో ఏపీ ఆరోగ్య, పరిశోధన రంగాలకు కొత్త ఊపు వస్తుందని నిపుణులు భావిస్తున్నారు.

## జూరాలకు పోటెత్తుతున్న కృష్ణమ్మ

**మొదటిపేజీ తరువాయి** - జూరాలకు ఇన్‌ఫ్లో భారీగా వచ్చి చేరుతోంది.ప్రస్తుతం జూరాల ప్రాజెక్టుకు 32,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా... అధికారులు క్రస్ట్ గేట్లు ఎత్తి వచ్చిన నీటిని వచ్చినట్లే దాదాపు 30,700 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి ప్రవాహం నిలకడగా కొనసాగుతుండటంతో దిగువన ఉన్న శ్రీశైలం జలాశయానికి కృష్ణమ్మ వేగంగా చేరుతోంది.మహారాష్ట్ర, కర్ణాటకలోని పశ్చిమ కనుమలతో పాటు భీమా నది పరీవాహక ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. భీమా నది ప్రవాహాలు కూడా తోడైతే జూరాలకు ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది. ఎగువ నుంచి వచ్చే ప్రవాహం భారీగా పెరిగే సూచనలు కనిపించడంతో, రాబోయే రోజుల్లో శ్రీశైలానికి మరింత జలకళ రానుందని నీటిపారుదల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

## శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి భేటీ

**మొదటిపేజీ తరువాయి** - సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు.గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 'ప్రధాని ఆవాస్ యోజన - గ్రామీణ్' 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. అదే సమయంలో, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు, ఎల్‌నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

## ఒక అధికారిని ఎక్కడ నియమించాలనేది ప్రభుత్వ విచక్షణాధికారం



**మొదటిపేజీ తరువాయి** - ఆదేశాలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. ఈ ఉత్తర్వులను సమీక్షిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైడ్రా కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని, ఆ సంస్థను మరింత బలోపేతం చేస్తామని ఆయన పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, హైడ్రా అనేది తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అతిపెద్ద సంస్కరణ అని అభివర్ణించారు. ఆక్రమణదారులు నకిలీ పత్రాలతో న్యాయస్థానాలను తప్పుదోవ పట్టిస్తూ, సోషల్ మీడియా వేదికగా ఏజెన్సీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం చేస్తున్నారని ఆయన ఆరోపించారు."బతుకమ్మ కుంటను ఆక్రమించింది పేదలా లేక పెద్దలా ఒక బీఆర్ఎస్ నేత అక్కడ 10 ఎకరాలు కబ్జా చేశారు. ఎన్ కన్వెన్షన్ పేదలదా గండిపేట చెరువు వద్ద కూల్చివేసినవి సామాన్యుల నిర్మాణాలా" అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. భూ కబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు.కబ్జాదారులను రక్షించేందుకు భారీగా నిధులు వెచ్చిస్తూ సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారాలు చేయిస్తున్నారని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన సోమేశ్ కుమార్‌పై 400 కోర్టు ధిక్కరణ కేసులు ఉన్న విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. హైడ్రా విషయంలో ప్రభుత్వానికి పూర్తి స్పష్టత ఉందని, ఒక అధికారిని ఎక్కడ నియమించాలన్నది ప్రభుత్వ విచక్షణాధికారమని ఆయన పేర్కొన్నారు. తప్పుడు కేసులను న్యాయస్థానాల్లోనే ఎదుర్కొంటామని స్పష్టం చేశారు.

# నేర చరిత్ర లేని వారిపై చర్యలు వద్దు



**మొదటిపేజీ తరువాయి** - ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది.ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. పిటిషనర్ల ఆరోపణలు ప్రాథమికంగా స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు అవసరాన్ని సూచిస్తున్నాయని పేర్కొంది. ఈ అంశంపై కేంద్రంతో పాటు అసోం, బీహార్, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.ఆందోళనల సందర్భంగా అదుపులోకి తీసుకున్న మైనర్లను వెంటనే విడుదల చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. కేవలం నిరసనల్లో పాల్గొన్నారనే కారణంతో అరెస్టు చేసిన లేదా అదుపులో ఉంచిన విద్యార్థులకు నేర చరిత్ర లేకపోతే వారిని కూడా విడుదల చేయాలని స్పష్టం చేసింది. అయితే క్రిమినల్ నేపథ్యం ఉన్న వారికి ఈ రక్షణ వర్తించదని పేర్కొంది.ఆందోళనలకు సంబంధించిన సీసీటీవీ దృశ్యాలు, డ్రోన్ వీడియోలు, బాడీ కెమెరా రికార్డింగులు, వైర్‌లెస్ కమ్యూనికేషన్ వివరాలు, పీసీఆర్ లాగ్‌లు సహా అన్ని ఎలక్ట్రానిక్ ఆధారాలను భద్రపరచాలని ధర్మాసనం ఆదేశించింది. విద్యార్థుల వ్యక్తిగత సమాచారం, డిజిటల్ డేటాను కూడా భద్రపరచాలని, అయితే ప్రస్తుతానికి వాటిని బహిర్గతం చేయవద్దని స్పష్టం చేసింది.పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులపైనా సమగ్ర దర్యాప్తు అవసరమని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. సుమారు 250 మంది పోలీసులకు కూడా గాయాలయ్యాయని తెలిపారు. నిరసనల్లో సంఘవిద్రోహ శక్తులు

## మంత్రి నారా లోకేశ్ కు పేర్ని నాని బహిరంగ సవాల్

**మొదటిపేజీ తరువాయి** - విరుచుకుపడ్డారు. డీఎస్సీ అవకతవకలపై బహిరంగ చర్చకు రావలసిందిగా ఆయన లోకేశ్ కు సవాల్ విసిరారు. ఒకవేళ చర్చకు ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తే వైసీపీ నుంచి జగన్ వస్తారని... లోకేశ్ వస్తే స్వయంగా తానే ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువత జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని పేర్ని నాని ఆరోపించారు. ప్రభుత్వం దీనిని 'మెగా డీఎస్సీ' అని ప్రచారం చేసుకుంటున్నప్పటికీ, లోపల జరిగిన అక్రమాల వల్ల ఇది 'దగా డీఎస్సీ'గా మారిందని మండిపడ్డారు. మంత్రిగా లోకేశ్ విద్యాశాఖ బాధ్యతలను పక్కనబెట్టి మిగిలిన అన్ని శాఖల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటున్నారని విమర్శించారు. కొంచెమైనా నైతికత ఉంటే ఈ కుంభకోణానికి బాధ్యత వహిస్తూ లోకేశ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నిరుద్యోగులకు న్యాయం జరిగే వరకు, డీఎస్సీ అక్రమాలపై పూర్తిస్థాయి విచారణ జరిపించి మంత్రి పదవికి లోకేశ్ రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగేది లేదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం కేవలం తమ సొంత ప్రచార సాధనాలు, పత్రికల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఎమ్మెల్యే బొండా ఉమ మంత్రి పదవి కోసం తీవ్రంగా లాబీయింగ్ చేస్తున్నారంటూ చేశారు.

## జపాన్‌ను వణికించిన భారీ భూకంపం

**మొదటిపేజీ తరువాయి** - యత్సుషిరో సముద్ర తీరాల్లో సుమారు ఒక మీటర్ ఎత్తున అలలు ఎగిసిపడే ముప్పు ఉందని, ప్రజలందరూ తీరానికి దూరంగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు హెచ్చరించారు. భూకంపం కారణంగా కుమమోటో ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భద్రతా కారణాల దృష్ట్యా బుల్లెట్ రైళ్లతో సహా అన్ని రైలు సర్వీసులను తాత్కాలికంగా రద్దు చేశారు. క్యుషు ద్వీపంలోని కుమమోటో, నాగసాకి, కగోషిమా, ఫుకుయోకా, సాగా, ఒయిటా, మియాజాకి ప్రాంతాల్లో జపాన్ ప్రభుత్వం తదుపరి అత్యవసర భూకంప హెచ్చరికలను జారీ చేసింది.జపాన్‌లో ప్రతి ఏటా వందలాది భూకంపాలు సంభవిస్తుంటాయి. ప్రపంచవ్యాప్తంగా సంభవించే భూకంపాలలో దాదాపు 18 శాతం జపాన్‌లోనే నమోదవుతుంటాయి. వీటిలో అత్యధిక శాతం స్వల్ప తీవ్రత కలిగినవే అయినప్పటికీ, కొన్నిసార్లు తీవ్ర నష్టం వాటిల్లుతుంది. 2011లో రిక్టర్ స్కేలుపై 9.0 తీవ్రతతో సంభవించిన వినాశకర భూకంప వల్ల సుమారు 18,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఏడాది ఏప్రిల్ 20న జపాన్ ఉత్తర ప్రాంతంలో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించిన సంగతి తెలిసిందే.

## అట్టుడుకుతున్న పాక్ ఆక్రమిత కశ్మీర్

**మొదటిపేజీ తరువాయి** - మంగళవారం ఎక్స్‌లో చేసిన పోస్టు ప్రకారం.. లాంగ్ మార్చ్ బృందాలు రావల్‌కోట్‌కు చేరుకున్నాయి. ఇప్పటివరకు 19 మంది మృతుల గుర్తింపును నిర్ధారించామని తెలిపింది. తలకు బుల్లెట్ గాయం అయిన మరో వ్యక్తి వద్ద గుర్తింపు పత్రాలు లేకపోవడంతో మొత్తం మృతుల సంఖ్య 20కి చేరిందని పేర్కొంది. పరిస్థితులు సాధారణమైన తర్వాత మరిన్ని వివరాలు వెల్లడిస్తామని తెలిపింది.జేఏఏసీ, పాకిస్థాన్ అధికారుల మధ్య చర్చలు విఫలం కావడంతో ఈ లాంగ్ మార్చ్ చేపట్టారు. ఆదివారం మీర్‌పూర్ డివిజన్ నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ సోమవారం ముజఫరాబాద్ వైపు సాగింది. మరోవైపు పాక్ భద్రతా బలగాలు శాంతియుత నిరసనకారులపై సోమవారం సాయంత్రం కాల్పులు, టియర్ గ్యాస్, భారీ బలప్రయోగానికి పాల్పడ్డాయని 'యునైటెడ్ కశ్మీర్ పీపుల్స్ నేషనల్ పార్టీ' (యూకేపీఎన్‌పీ) ఆరోపించింది. దీంతో పలువురు మృతి చెందగా, మరికొందరు గాయపడ్డారని పేర్కొంది.ఈ ఘటనపై ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ మానవ హక్కుల సంస్థలు వెంటనే జోక్యం చేసుకోవాలని యూకేపీఎన్‌పీ కోరింది. శాంతియుత నిరసనకారులపై కాల్పులు, అధిక బలప్రయోగాన్ని నిలిపివేయాలని పాకిస్థాన్‌పై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేసింది. మరోవైపు పీఓకేలో జరుగుతున్న నిరసనలపై భారత విదేశాంగ శాఖ గత నెల స్పందించింది. అక్కడ పోలీసుల దౌర్జన్యాల్లో పలువురు మరణించారని, అనేక మంది గాయపడ్డారని పేర్కొంటూ పాకిస్థాన్‌ను అంతర్జాతీయ సమాజం జవాబుదారీగా నిలపాలని ఆశిస్తున్నట్లు విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలిపారు.

## మేం ఎవరికి ఏం అమ్మాలో ఎవరూ చెప్పనక్కర్లేదు

**మొదటిపేజీ తరువాయి** - నెతన్యాహు వ్యక్తం చేసిన అభ్యంతరాలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా తోసిపుచ్చారు. తాము ఎవరికి ఏ ఆయుధాలు అమ్మాలో ఎవరూ తమకు చెప్పాల్సిన అవసరం లేదని ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు.ఇజ్రాయెల్ ప్రధానితో భేటీకి ముందు రోజు ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం అంతర్జాతీయంగా తీవ్ర ప్రాధాన్యత సంతరించుకుంది. టర్కీ ప్రెసిడెంట్ రెజెప్ తయ్యిప్ ఎర్డోగాన్‌ను తన మంచి మిత్రుడిగా అభివర్ణించిన ట్రంప్... టర్కీ తమకు అత్యంత విలువైన, నమ్మకమైన భాగస్వామి అని కొనియాడారు.అంతకుముందు ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, టర్కీ తీవ్రవాద భావజాలంతో కూడిన పాలనలో ఉందని, అలాంటి దేశానికి ఎఫ్-35 యుద్ధ విమానాలను విక్రయిస్తే పశ్చిమాసియాలో సైనిక సమతుల్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ విమర్శలకు ట్రంప్ ఘాటుగా స్పందిస్తూ, ఇజ్రాయెల్‌కు టర్కీపై మంచి అభిప్రాయం లేకపోవచ్చు కానీ తన విషయంలో మాత్రం టర్కీ ఎంతో నమ్మకంగా వ్యవహరించిందని స్పష్టం చేశారు.

## "ప్రతి సంవత్సరం ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లిస్తాం

**మొదటిపేజీ తరువాయి** - గ్లోబరీనా వంటి సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో చట్టాలు రూపొందిస్తామని, ఫీజు రీఎంబర్స్‌మెంట్ కొట్టేయాలని చూసిన సంస్థలపై విచారణ జరుగుతోందని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. బకాయి పెట్టిన ఫీజు రీఎంబర్స్‌మెంట్ రూ.8 వేల కోట్లు భారంగా మారిందని అన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ తాము ఇవ్వట్లేదనే భ్రమలు కల్పించే యత్నం చేస్తున్నారని విమర్శించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై రామచందర్‌రావు, ఆర్.కృష్ణయ్య పదేపదే ప్రశ్నిస్తున్నారని తెలిపారు.ఏపీలో రూ.10 వేల కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయని, ఆర్.కృష్ణయ్య ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఏపీ రాష్ట్రంలో బకాయిలపై మాట్లాడరని సీఎం తెలిపారు. ఏపీలో ఎన్డీఏ ప్రభుత్వం ఉందని, అక్కడ బకాయిలపై మాట్లాడాలని, ఏపీలో ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాక తెలంగాణ గురించి మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఏ ఏడాదికి సంబంధించిన బకాయిలు అదే ఏడాది చెల్లిస్తామని, ఏటా ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రణాళికలు రచించామని, భవిష్యత్తులో ఫీజు రీఎంబర్స్‌మెంట్ సమస్య తెలంగాణలో ఉండదని స్పష్టం చేశారు.విద్యాశాఖలో రాష్ట్ర పరిధి అధికారాలను కేంద్రం లాక్కునే ప్రయత్నం. యూనివర్సిటీలపై ఆధిపత్యం చలాయించాలని కేంద్రం యత్నిస్తోంది. విద్య వీలైనంత వరకు రాష్ట్ర పరిధిలో ఉంటే తప్పిదాలు జరగకుండా ఉంటాయి. కేంద్ర చట్టాల మేరకు రాష్ట్రంలో ప్రక్షాళనపై యోచిస్తాం. పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రక్షాళన చేసి నియామకాలు చేపట్టాం.రాష్ట్రంలో పారదర్శకంగా పరీక్షలు నిర్వహించాం. విద్యార్థులకు నమ్మకం కలిగించేలా ప్రభుత్వం పరీక్షలు నిర్వహిస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి.

## తెలంగాణలో ఏర్పడేది డబుల్ ఇంజిన్ సర్కారే



**మొదటిపేజీ తరువాయి** - ముసుగులో విదేశీ నిధులు సేకరిస్తూ దేశాన్ని విభజించేందుకు కొన్ని కుట్రలు సాగుతున్నాయని, దేశ సమగ్రతను కాపాడుకోవడానికి ప్రజలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని రాంచందర్ రావు తీవ్రంగా ఖండించారు. ఇది ప్రతి పదేళ్లకు ఒకసారి సాధారణంగా జరిగే ప్రక్రియ మాత్రమేనని, దీనిని అడ్డుపెట్టుకుని అనవసర భయాందోళనలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని హెచ్చరించారు. దేశ భద్రత విషయంలో ఎలాంటి ఒడిదుడుకులను సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.

# ఏపీపై ఎల్‌నినో పంజా.. సీఎం చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష

**ఏపీపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం.. జూలైలో 69 శాతం లోటు వర్షపాతం**

**రానున్న నెలల్లో 40 శాతం వరకు వర్షాభావ పరిస్థితులు**

**పత్తి, వరి పంటలపై ప్రభావం.. 122 మండలాలను గుర్తించిన ప్రభుత్వం**

**పంటల రక్షణకు అత్యవసర ప్రణాళిక..**

**ప్రత్యామ్నాయాలపై దృష్టి**



పశుగ్రాసానికి కొరత లేదు.. 5 నెలలకు సరిపడా నిల్వలు సిద్ధం

ఆంధ్రప్రదేశ్‌పై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపుతోంది. రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్ధక, నీటిపారుదల శాఖల అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సమీక్షకు మంత్రి అచ్చెన్నాయుడు జూమ్ ద్వారా హాజరయ్యారు.ఈ సందర్భంగా అధికారులు పరిస్థితి తీవ్రతను ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రంలో జూలై నెలలో ఏకంగా 69 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. రాబోయే మూడు నెలల్లో సగటున 35 నుంచి 40 శాతం వరకు వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. జూన్ నుంచి నవంబర్ మధ్య కాలంలో సాధారణంగా 844 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఈసారి కేవలం 551 మి.మీ మాత్రమే కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు. అంచనాలకు మించి ఎల్‌నినో ప్రభావం ఉండబోతోందని అధికారులు స్పష్టం చేశారు.ఈ ప్రభావం అన్ని జిల్లాల్లో ఉన్నప్పటికీ ముఖ్యంగా పశ్చిమ గోదావరి, ప్రకాశం, అన్నమయ్య, కృష్ణా, కడప జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు ఎక్కువగా ఉంటాయని అధికారులు తెలిపారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.78 లక్షల హెక్టార్లలో పత్తి, 1.07 లక్షల హెక్టార్లలో వరి పంటలపై తీవ్ర ప్రభావం పడుతుందని అంచనా వేశారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో వరి పంటకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పడంతో, వంశధార జలాలను తరలించి పంటలను కాపాడేందుకు ప్రయత్నించాలని సీఎం చంద్రబాబు సూచించారు.ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రంలో 122 హై రిస్క్ మండలాలను గుర్తించిందని అధికారులు తెలిపారు. ఈ మండలాల్లో బోరు బావుల ఆధారంగా పంటలను కాపాడుకునే అవకాశాలను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. రైతులకు అవగాహన కల్పించేందుకు ఆగస్ట్ 3 నుంచి ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నట్లు, వరికి ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా అత్యవసర విత్తన ప్రణాళికను సిద్ధం చేసినట్లు అధికారులు వివరించారు.ఫసల్ బీమా యోజన, వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద నమోదుకు ఈ నెల 31 వరకు గడువు ఉందని, వరి పంటకు మాత్రం ఆగస్ట్ 15 వరకు సమయం ఉందని అధికారులు గుర్తుచేశారు. మరోవైపు, పశుగ్రాసానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా ఐదు నెలలకు సరిపడా 286.30 లక్షల మెట్రిక్ టన్నుల గ్రాసాన్ని అందుబాటులో ఉంచామని పశుసంవర్ధక శాఖ అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.

# హైదరాబాద్‌లో భారీవర్షంతో చెరువుల్లా మారిన రహదారులు

**కిలోమీటర్ల మేర నిలిచిన ట్రాఫిక్**

**హైదరాబాద్ నగరంలో ఒక్కసారిగా భారీ వర్షం**

**కురిసిన భారీవర్షంతో రహదారులన్నీ జలమయం**

**పలుచోట్ల పొంగి పొర్లుతున్న డ్రైనేజీలు**

**ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు**



హైదరాబాద్ నగరంలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి ఆకాశం పూర్తిగా మేఘావృతం కాగా ఒక్కసారిగా వర్షం మొదలైంది. మొదట రాజేంద్ర నగర్‌లో ప్రారంభమైన వాన క్రమంగా నగరమంతా విస్తరిస్తూ వచ్చింది. అక్కడక్కడా భారీగా, కొన్ని చోట్ల మోస్తరుగా కురుస్తూ భాగ్యనగరాన్ని తడిపేసింది.ఒక్కసారిగా కురిసిన భారీవర్షంతో రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల డ్రైనేజీలు పొంగి పొర్లుతున్నాయి. పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముషీరాబాద్‌లో అత్యధికంగా 31 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.మాదాపూర్, గచ్చిబౌలి రాయదుర్గం ప్రాంతాల్లో సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. వాన నీటితో రోడ్లు మునగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మాదాపూర్, కేపీహెచ్‌బీ మార్గంలో, మాదాపూర్ ఐకియా బయోడైవర్సిటీ మార్గంలో గచ్చిబౌలి రాయదుర్గం మార్గంలో వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. కిలోమీటర్ దూరానికి గంట సమయం పడుతోంది.రాజేంద్రనగర్, అత్తాపూర్, హైదర్‌గూడా, ఉప్పరపల్లి, లంగర్‌హౌస్, కార్వాన్ తదితర ప్రాంతాల్లో వర్షం దంచికొట్టడంతో రహదారులు జలమయమయ్యాయి. ఇదే సమయంలో కార్యాలయాలు ముగిసే వేళ కావడంతో రోడ్లపై నీరు నిలిచి చెరువుల్లా మారాయి. దీంతో ట్రాఫిక్ ఎక్కడికక్కడ నిలిచిపోయి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నెమ్మదిగా సాగగా, ద్విచక్ర వాహనదారులు వర్షంలో తడుస్తూ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇబ్బందిపడ్డారు. హైదర్‌గూడా టీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్ హైవే ఫ్లైఓవర్ కింద, పిల్లర్ నంబర్--216 సమీపంలో రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో ఆ మార్గంలో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది.కేపీహెచ్‌బీ, నిజాంపేట్, బాచుపల్లి, ప్రాంతాల్లో ట్రాఫిక్ నెమ్మదిగా సాగుతోంది. ట్రాఫిక్ సమస్యలతో చాలామంది మెట్రోను ఆశ్రయించారు. దీంతో మెట్రో రైళ్లు, స్టేషన్లు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. కోఠిలో భారీ వర్షం పడడంతో రహదారులపై భారీగా నీరు చేరి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ట్రాఫిక్‌లో అంబులెన్స్ కొద్దిసేపు చిక్కుకుపోయింది.దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతంలో దంచికొడుతున్న వర్షంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోతున్నాయి. దిల్‌సుఖ్‌నగర్, కొత్తపేట, సరూర్ నగర్, కర్మాన్ ఘాట్, మలక్‌పేట్, చాదర్ ఘాట్ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షంతో పలు రహదారులు జలమయమయ్యాయి. ముఖ్యంగా చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. చాదర్‌ఘాట్ నుంచి మలక్‌పేట్ రైల్వే అండర్‌పాస్ వరకు వాహనాలు కిలోమీటర్ల మేర బారులు తీరాయి.కార్యాలయాల నుంచి ఇళ్లకు బయలుదేరిన ఉద్యోగులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షం కొనసాగుతుండటంతో వాహనదారులు అప్రమత్తంగా ప్రయాణించాలని, వీలైతే ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు.భారీవర్షం ప్రారంభంకాగానే జీహెచ్ఎంసీ, ఫైర్, హైడ్రా సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచే ప్రాంతాల్లో వర్షపు నీటిని తొలగించే పనులను వేగవంతం చేశారు. నగరంలో వర్షాల ప్రభావం కొనసాగొచ్చని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.

# సీఎం చంద్రబాబుతోనే ప్రజల భవిష్యత్‌కు భరోసా

**ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి**

**ప్రజల సంక్షేమం, అభివృద్ధి కూటమి పాలనతోనే సాధ్యమని స్పష్టం.. సీఎం చంద్రబాబు ఈ రెండేళ్లలో రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొస్తే పుట్టపర్తి నియోజకవర్గానికి రూ.2,202.07 కోట్లతో సంక్షేమం, అభివృద్ధి పనులు చేశాం.**

**కృష్ణాపురం పంచాయతీలో ఇంటింటికి తెలుగుదేశం పార్టీ ప్రచార కార్యక్రమానికి హాజరైన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె**

**ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర మాజీ మంత్రి డాక్టర్ పల్లె కు పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు.**

అనంత పురం బ్యూరో జూలై 28 నేటి శుభోదయ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోనే రాష్ట్ర ప్రజల భవిష్యత్‌కు భరోసా లభిస్తుందని, సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు.45 రోజుల పాటు నిర్వహిస్తున్న "ఇంటింటికి తెలుగుదేశం" ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు మంగళవారం బుక్కపట్నం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.వీరితోపాటు కూటమి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి వారు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, రెండేళ్ల కూటమి పాలనలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి రూ.25 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చారని తెలిపారు. అదే స్ఫూర్తితో పుట్టపర్తి నియోజకవర్గ అభివృద్ధికి తన నాయకత్వంలో ఇప్పటికే రూ.2,202.07 కోట్ల తో సంక్షేమం , అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.అదేవిధంగా, సత్యసాయి బాబా ప్రత్యేక ఆశీస్సులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ ప్రత్యేక కృషితో పుట్టపర్తికి రూ.15,803 కోట్లతో డిఫెన్స్ సిటీ -- ఏఎంసీఏ 5వ తరం యుద్ధ విమానాల తయారీ కేంద్రం, ఆమడగూరులో రూ.51 వేల కోట్లతో రిలయన్స్ సోలార్ ప్లాంట్ ఏర్పాటు కానుండటంతో పాటు మొత్తం రూ.67,103 కోట్ల విలువైన ప్రత్యేక అభివృద్ధి పనులు ఈ ప్రాంతానికి లభించాయని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి పుట్టపర్తి ప్రాంత ఆర్థికాభివృద్ధికి కొత్త దిశను చూపనున్నాయని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గం లో 193 చెరువులతో పాటు రెండు రిజర్వాయర్లను కృష్ణాజిల్లాలతో నింపి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయడమే తన లక్ష్యమన్నారు. వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సాగునీరుతోపాటు పండ్ల తోటల పెంపకానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. రాయలసీమ రైతాంగానికి మేలు చేసే విధంగా కూటమి ప్రభుత్వం 30 వేల కోట్లతో హార్టికల్చర్ హబ్ గా మార్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలిపారు. గత ఎన్నికలకు ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను తూచా తప్పకుండా 90 శాతం అమలు చేశామని మిగిలిన 10 శాతం హామీలను వచ్చే మూడేళ్లలో అమలు చేసి తీరుతామని ప్రజలకు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లతో పాటు తల్లికి వందనం దీపం పథకం 2 కింద మహిళలకు ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు శ్రీ శక్తి పథకం ద్వారా మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి 20,000 ఆర్థిక సహాయం ప్రతి రైతుకు శాశ్వత ఆస్తి హక్కు కల్పించేలా ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం చేపట్టిందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ఈ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో 100% పెట్టుబడిలో 25%03 పెట్టుబడులు ఏపీ రాష్ట్రానికి వచ్చాయని అందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనే నిదర్శనం అన్నారు. ఈ రెండేళ్లలో సంక్షేమం అభివృద్ధి రెండేళ్ల పాలన పై ప్రజలు ఎంతో



నమ్మకంతో కూటమి ప్రభుత్వంపై ఎంతో విశ్వాసం ఉంచారని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు తెలియచెప్పే కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ప్రతి ఒకరిని పలకరించి వారికి పూర్తి భరోసా నమ్మకాన్ని కలిగించే ఏర్పాటు ఈ ప్రభుత్వం చేస్తుందని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోని అత్యధిక పెన్షన్ మంజూరు చేస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఏకైక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అని కొనియాడారు. గత వైసిపి పాలనలో అప్పటి నేత జగన్మోహన్ రెడ్డి సాధించిన అరాచక విధ్వంస పాలనతో ఆంధ్రప్రదేశ్ అప్పుల రాష్ట్రంగా మారిందన్నారు. వైసిపి ప్రభుత్వం లో సాగించిన విధ్వంసం వల్ల ఏపీ ప్రగతి పూర్తిగా దెబ్బతినిందని పేర్కొన్నారు. దేశంలో రాజధాని లేని ఏపీ రాష్ట్రానికి నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి రాగానే అప్పుల నుంచి బయటకు వచ్చి అభివృద్ధి పథంలో ఆంధ్రప్రదేశ్ పరుగులు తీస్తోందని తెలిపారు. రాబోయే మూడేళ్లలో ఆంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో నెంబర్ వన్ గా దేశానికి రోల్ మోడల్ గా నిలుస్తుందని పేర్కొన్నారు. అదేవిధంగా పుట్టపర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి నేతృత్వంలో ఊహించిన అభివృద్ధి చేపట్టారని గుర్తు చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక సహాయ సహకారాలతో పుట్టపర్తిలో రెండు లక్షల కోట్ల పెట్టుబడులతో యుద్ధ విమానాల తయారీ పరిశ్రమతో పాటు మరెన్నో అంతర్జాతీయ పరిశ్రమలు పుట్టపర్తిలో ఏర్పాటు కానున్నాయని పేర్కొన్నారు. దీంతో నియోజకవర్గంలో ఉన్న ప్రజల అభివృద్ధితో పాటు గ్రామాల అభివృద్ధి , వేలాదిమందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని అందుకు ప్రజల మద్దతు ఎంతో అవసరమన్నారు. అతి త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించి గ్రామాల అభివృద్ధికి తోడ్పాటున ఇవ్వాలని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమానికి గ్రామ ప్రజలు అపూర్వ స్పందన చూపారు. ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డికి మహిళలు మంగళహారతులు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. గ్రామస్తులు పూల వర్షం కురిపిస్తూ నాయకులను ఆహ్వానించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో కూటమి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఉద్యానవన పంటలకు ప్రోత్సాహం : ఎంపీ పుట్టా మహేష్ కుమార్

**-- ఉద్యానవన పంటల సాగు రైతులకు పలు ప్రోత్సాహకాలు**

**-- ఎం ఐడిహెచ్ మిషన్ కింద చిన్న, సన్నకారు రైతులకు సబ్సిడీలు**



ఢిల్లీ, ఏలూరు, నేటి శుభోదయ ::: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో చిన్న, సన్నకారు రైతులు రక్షిత సాగు, సూక్ష్మ నీటిపారుదల, మల్చింగ్ మరియు ఇతర ఉద్యానవన సాంకేతికతలను అవలంబించడాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. పార్లమెంటు వర్షాకాల సమావేశాల సందర్భంగా ఉద్యానవన పంటలకు కేంద్రం అందిస్తున్న ప్రోత్సాహాలపై లోక్‌సభలో ప్రశ్నించారు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్. ఏలూరు ఎంపీ అడిగిన ప్రశ్నకు కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ సమాధానం ఇస్తూ... "సమగ్ర ఉద్యానవన అభివృద్ధి మిషన్, ఇతర ఉద్యానవన అభివృద్ధి పథకాల కింద కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం, సబ్సిడీలను అందిస్తున్నట్లు వివరించారు. ఎం ఐడిహెచ్ కింద, రక్షిత సాగు సాంకేతికతలను అవలంబించడంలో రైతులకు సహాయపడటానికి సంస్థాగత, సాంకేతిక మరియు విస్తరణ మద్దతు అందించబడుతుంది. ఈ మద్దతు రాష్ట్ర ఉద్యానవన మిషన్లు, సాంకేతిక సహాయక బృందాలు, ప్రెసిషన్ ఫార్మింగ్ డెవలప్‌మెంట్ సెంటర్లు, సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్, సంస్థలు, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన్ కేంద్రాలు, ఇతర గుర్తింపు పొందిన సంస్థల ద్వారా అందించబడుతుందని కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తెలిపారు. స్వచ్ఛ మొక్కల కార్యక్రమం, ఉద్యానవన క్లస్టర్ అభివృద్ధి వంటి కార్యక్రమాల అమలు ద్వారా జాతీయ ఉద్యానవన మండలి (ఎన్ హెచ్ బి) నుంచి సంస్థాగత మరియు సాంకేతిక మద్దతును కూడా అందిస్తున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు.?ఇండో-ఇజ్రాయెల్, ఇండో-డచ్ సహకారం, పరిశోధనా సంస్థల ద్వారా ఎం ఐడిహెచ్ కింద 61 పంటల వారీ "క్రాప్ స్పెసిఫిక్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" స్థాపించినట్లు చెప్పిన కేంద్ర మంత్రి రైతులు, క్షేత్రస్థాయి కార్యకర్తల కోసం శిక్షణ సహాయం కూడా ఇస్తున్నట్లు తెలిపారు. ఇంకా, పాలీ హౌస్, షేడ్ నెట్ హౌస్, ప్లాస్టిక్/నాన్-వోవెన్ క్లాత్ టన్నెల్స్, వాక్ ఇన్ టన్నెల్స్ మొదలైన రక్షిత సాగు నిర్మాణాల కోసం ఎం ఐడిహెచ్ కింద ఆర్థిక మరియు సాంకేతిక సహాయం అందిస్తున్నట్లు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ కు కేంద్ర మంత్రి వివరించారు.?దీనిపై ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలను ఉపయోగించుకుని బిందు సేద్యం, స్ప్రింకర్లు, పాలీ హౌస్, షేడ్ నెట్ హౌస్ వంటి వాటిపై దృష్టి పెడితే నీటి పొదుపుతోపాటు, పంటల ఉత్పాదకత పెరుగుతుందని, కాబట్టి రైతులు సాంప్రదాయ పంటల సాగుతోపాటు ఉద్యానవన పంటల సాగుకు కూడా ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా వర్షాభావ పరిస్థితుల నుంచి గట్టెక్కేందుకు ప్రయత్నించాలని కోరారు.

## దేశ ఎగుమతి వృద్ధి లో ప్రతి జిల్లా ను ఒక క్రియాశీలక భాగస్వామ్యం గా చేయడమే లక్ష్యం

**- కేంద్రం జిఎల్- ట్యాగ్ గల కొండపల్లి బొమ్మల ఎగుమతి ప్రోత్సాహం, కళాకారులకు అందుతున్న ప్రోత్సాహం పై ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్న**




విజయవాడ, జూలై 28 (నేటి శుభోదయ):-పార్లమెంట్ లో ఆంధ్రప్రదేశ్‌లోని జిఎల్-ట్యాగ్ గల కొండపల్లి టాయ్స్ క్లస్టర్‌కు సంబంధించి ముడి పదార్థాల లభ్యత, ఎగుమతి పరిమితులు, సరఫరా-గొలుసు అవసరాలకు సంబంధించి 'జిల్లాలను ఎగుమతి కేంద్రాలుగా' చొరవ కింద ఏదైనా అంచనా, దాని వివరాలు, కనుగొన్న విషయాలు, కాకపోతే, దానికి గల కారణాలు, మూడు సంవత్సరాలలో జిల్లాలను ఎగుమతి కేంద్రాలుగా, ఒక జిల్లా ఒక ఉత్పత్తి, ఇతర కేంద్ర ఎగుమతి ప్రోత్సాహక పథకాల కింద కొండపల్లి బొమ్మల ప్రోత్సాహం కోసం మంజూరు చేయబడిన, విడుదల చేయబడిన, వినియోగించబడిన నిధుల వివరాలపై, ఆంధ్రప్రదేశ్‌లో కొండపల్లి టాయ్స్ కోసం ప్రభుత్వం ఒక ఉమ్మడి సౌకర్య కేంద్రం, రూపకల్పన, పరీక్షా ప్రయోగశాల లేదా ఎగుమతి సౌకర్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదిస్తోందా, అలా అయితే, ప్రతిపాదిత కాలపరిమితితో సహా దాని వివరాలు;గత మూడు సంవత్సరాలలో కొండపల్లి కళాకారుల (ఇ) కోసం నిర్వహించిన డిజైన్ అభివృద్ధి కార్యక్రమాలు, టెక్నాలజీ ఉన్నతీకరణ వర్క్‌షాప్‌లు, ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాల వివరాల పై కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖను ఎంపీ కేశినేని చిన్ని ప్రశ్నించారు. దీనికి వాణిజ్య మరియు పరిశ్రమల మంత్రిత్వ శాఖలో రాష్ట్ర మంత్రి జితిన్ ప్రసాద సమాధానమిచ్చారు ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితిన్ ప్రసాద మాట్లాడుతూ వాణిజ్య శాఖ యొక్క 'జిల్లాలను ఎగుమతి కేంద్రాలుగా' అనే కార్యక్రమం, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ ద్వారా అమలు చేయబడుతోంది. ఇది దేశ ఎగుమతి వృద్ధిలో ప్రతి జిల్లాను ఒక క్రియాశీల భాగస్వామిగా చేయడం ద్వారా ఎగుమతి ప్రోత్సాహక ప్రయత్నాలను వికేంద్రీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం క్రింద అన్ని రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలలో రాష్ట్ర ఎగుమతి ప్రోత్సాహక కమిటీలు (రాఇప్రాకలు), జిల్లా స్థాయిలో జిల్లా ఎగుమతి ప్రోత్సాహక కమిటీలు (జిఇప్రాకలు) రూపంలో ఒక సంస్థాగత యంత్రాంగం స్థాపించబడింది. వీటికి జిల్లా కలెక్టర్/మేజిస్ట్రేట్ అధ్యక్షత వహిస్తారు అని తెలిపారు దేశవ్యాప్తంగా 734 జిల్లాల్లో ఎగుమతి సామర్థ్యం గల ఉత్పత్తులు, సేవలను గుర్తించడం జరిగింది. అలాగే, 590 జిల్లాల కోసం ముసాయిదా జిల్లా ఎగుమతి కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేశారు. డిఇహెచ్ చొరవ, పరిశ్రమల ప్రోత్సాహం మరియు అంతర్గత వాణిజ్య శాఖ యొక్క 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' చొరవకు అనుబంధంగా ఉండి, చొరవ కింద గుర్తించిన ఉత్పత్తుల ఎగుమతులను ప్రోత్సహించడానికి ఒక కార్యాచరణ అందిస్తుంది అని అన్నారు.జిఇకే చొరవ కింద చేపట్టాల్సిన పనులలో ఇవి ఉన్నాయని,ప్రతి జిల్లాలో ఎగుమతి సామర్థ్యం ఉన్న ఉత్పత్తులు , సేవలను గుర్తించడం, ఇందులో ట్యాగ్ ఉన్న, సాంప్రదాయ హస్తకళా ఉత్పత్తులు కూడా ఉంటాయని , అటువంటి ఉత్పత్తులు, సేవల ఎగుమతులను ప్రోత్సహించడానికి అవలంబించిన జిఇకాప్రాను సిద్ధం చేయడం కాలానుగుణంగా సమీక్షించడం, ఉత్పత్తి, క్లస్టర్ బలాలు, ముడి పదార్థాల లభ్యత, ప్రస్తుత ఎగుమతి పనితీరు మరియు సరఫరా-గొలుసు అనుసంధానాలను అంచనా వేయడం, సమీకరణ, రూపకల్పన మరియు ఉత్పత్తి అభివృద్ధి, నాణ్యత, ధృవీకరణ, పరీక్ష, ప్యాకేజింగ్, లాజిస్టిక్స్ అనుసంధానం, కొనుగోలుదారుల అనుసంధానాలకు సంబంధించిన లోపాలను, వాటికి సంబంధించిన కార్యాచరణ అంశాలతో పాటు గుర్తించడం, విస్తృత ప్రచారం, సామర్థ్య పెంపు, ఎగుమతి-అవగాహన కార్యక్రమాల ద్వారా కొత్త, ప్రస్తుత ఎగుమతిదారులకు చేయూతనివ్వడం, కొనుగోలుదారు-విక్రేత సమావేశాలు, ప్రదర్శనలు, ఇ-కామర్స్ ఆన్‌బోర్డింగ్ ద్వారా మార్కెట్ ప్రవేశాన్ని సులభతరం చేయడం; మరియు, ముఖ్యంగా, కేంద్ర మంత్రిత్వ శాఖలు/విభాగాలు, ఎగుమతి ప్రోత్సాహక మండలాలు, కమోడిటీ బోర్డులు, రాష్ట్ర ప్రభుత్వాల కింద అందుబాటులో ఉన్న ఆర్థిక సహాయంతో సహా కొనసాగుతున్న పథకాలు మరియు కార్యక్రమాలను ఏకీకృతం చేయడం. ఎగుమతి, జిల్లా స్థాయి డేటా మరియు జిఇకాప్రాలు ఇ+ఖీ వెబ్‌సైట్‌తో సహా ప్రజలకు అందుబాటులో ఉంచబడతాయి అని తెలియచేసారు ఆంధ్రప్రదేశ్, ఎన్టీఆర్ జిల్లాకు చెందిన జీఎల్-నమోదిత హస్తకళ అయిన కొండపల్లి బొమ్మల ఎగుమతి సామర్థ్యాన్ని, ఈ కసరత్తులో భాగంగా డీఈపీసీలో సంప్రదింపుల ద్వారా అంచనా వేయడం జరిగింది. ఈ క్లస్టర్ యొక్క విలువ-గొలుసు అవసరాలకు డీఈఏపీ మద్దతు ఇస్తుంది. ఇందులో ముడి పదార్థాల (అటువంటి బొమ్మల విషయంలో తెల్ల పొనికి సాఫ్ట్‌వుడ్) లభ్యత, డిజైన్ మరియు ఉత్పత్తి అభివృద్ధి, నాణ్యత మరియు భద్రతా ధృవీకరణ, ప్యాకేజింగ్, కొనుగోలుదారులతో అనుసంధానం వంటి అంశాలతో..

## 'స్థానిక ఎన్నికలకు సంస్థాగతంగా సిద్ధమవుతున్న బీజేపీ.'

**- జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర వ్యాఖ్యలు**



రాజమహేంద్రవరం, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె);గోపాలపురం అసెంబ్లీ నియోజకవర్గ బిజెపి నాయకులు కార్యకర్తలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతూ.. సంస్థాగతంగా పార్టీ బలోపేతం కోసం మరియు రానున్న స్థానిక ఎన్నికల కోసం చర్చించడం జరిగింది. పంచాయతీలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ తరఫున అధిక స్థానాల్లో అభ్యర్థులను బరిలోకి దింపి గెలిపించేందుకు కృషి చేస్తాము, అందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాము. క్షేత్ర స్థాయిలో పార్టీ బలోపేతానికి స్థానిక సంస్థల ఎన్నికలు కీలకం కనుక ఎక్కువ మంది పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజా ప్రతినిధులుగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా పని చేస్తాము. పార్టీ కార్యకర్తల ఆత్మ గౌరవానికి భంగం కలిగిస్తే చూస్తూ ఊరుకునేదిలేదన్నారు.ప్రభుత్వ కార్యక్రమాల్లో భారతీయ జనతా పార్టీ నాయకులకు కూడా సముచిత ప్రాధాన్యం కల్పించి వేదికలపై భాగస్వామ్యం చేయాలని బీజేపీ తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర కోరారు. కూటమి ప్రభుత్వ కార్యక్రమాల్లో బీజేపీ నాయకులను ఆహ్వానించి వేదికపై స్థానం కల్పించాలని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుకు విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సమావేశాలకు బీజేపీ నాయకులను పిలవడం లేదని తమకు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. సమావేశంలో గోపాలపురం నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు వీర రాఘవులు, జోనల్ ఇన్‌చార్జి శరణాల మాలతీరాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి శెట్టిపల్లి శివనాగరాజు, జిల్లా ఉపాధ్యక్షురాలు పాకలపాటి మంగతాయారు, జిల్లా కార్యదర్శి గల్లా శ్రీనుబాబు, ఎస్సీ మోర్చా జోనల్ ఇన్‌చార్జి దున్న సుమన్‌బాబు, ఏఎంసీ డైరెక్టర్ సత్యకుమార్, నాలుగు మండలాల అధ్యక్షులు, బీఎల్-2లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## గురుపౌర్ణమి సందర్భంగా ఆదిగురువుల శోభాయాత్ర ఘనంగా నిర్వహణ



ఒంగోలు, నేటి శుభోదయ ::: గురుపౌర్ణమి సందర్భంగా ఆదిగురువులైన జగద్గురు ఆదిశంకరాచార్యులు మరియు వేదవ్యాస మహర్షి వారి శోభాయాత్ర భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడింది. ఈ ఊరేగింపు రంగా రాయుడి చెరువు వద్దగల శంకర మఠం కంచి కామాక్షి దేవస్థానం నుండి ప్రారంభమై, అయ్యప్ప స్వామి దేవస్థానం ప్రాంగణంలోని వేద పాఠశాల వరకు వైభవంగా సాగింది. ఈ కార్యక్రమం వ్యమజాల ప్రసన్న కుమార్ శర్మ, చలపతిరావు, గంజాం రంగనాథం, టి. శ్రీనివాసరావు నేతృత్వంలో ఘనంగా జరిగింది. వేద మంత్రోచ్చారణలు, భజనలు, మంగళ వాయిద్యాల నడుమ సాగిన ఈ శోభాయాత్రలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆదిగురువులకు ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ ప్రముఖులు సోమా సుబ్బారావు, వేమూరి చక్రధర్, పెరుమాళ్లు, సుంకు రఘు తదితరులు పాల్గొన్నారు. అనంతరం గురుపరంపర విశిష్టతను వివరిస్తూ ప్రసంగాలు నిర్వహించగా, భక్తులు విశేష ఉత్సాహంతో శోభాయాత్రలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## జిల్లా జైలును సందర్శించిన అదనపు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి. వరలక్ష్మి



విజయవాడ, జూలై 28 (నేటి శుభోదయ):-మండల న్యాయ సేవాధికార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం గాంధీనగర్ లోని జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి అదనపు సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి వా. వరలక్ష్మి సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి జైల్లో ఉన్నటువంటి ముద్దాయిలకు అందుతున్న సౌకర్యం గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాలను రుచి చూడటంతో పాటు, ఏ రోజు ఏ ఆహార పదార్థాలను పెడుతున్నారు అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం న్యాయవిజ్ఞాన సదస్సును నిర్వహించి జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నుండి అనేక కేసులను ఎదుర్కొంటున్న ముద్దాయిల వివరాలను వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరిస్తుందని, రాజ్యాంగం ప్రకారం వారి హక్కులను కాపాడటం కోసం జిల్లా జైలులో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని నిర్వహిస్తున్నామని ఈ సహాయ కేంద్రం ద్వారా అనేకమంది ముద్దాయిలకు న్యాయ సేవలను అందజేస్తున్నామని తెలియజేశారు. అలాగే ప్రపంచ ప్రకృతి సంరక్షణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరు ప్రకృతి వనరులను కాపాడుకోవాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షణ అధికారి ఎండి ఇర్ఫాన్, జైలర్లు ఎన్ గణేష్, సిహెచ్ వేణు, ప్యానల్ లాయర్ ఎస్ ఆర్ దుర్గాప్రసాద్, పారా లీగల్ వాలంటీర్ బి శారద, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## అథ్లెటిక్స్ పోటీల్లో విజన్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ




యాడికి జూలై 28 అనంతపురం జిల్లా రిపోర్టర్ బండారు బాలకృష్ణ నేటి శుభోదయ తెలుగు దినపత్రిక :మండల కేంద్రమైన యాడికిలోని విజన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు 'అనంత ఛాంపియన్షిప్ అథ్లెటిక్స్' పోటీలలో విశేష ప్రతిభ కనబరిచారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో వివిధ పాఠశాలల క్రీడాకారుల మధ్య హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో విజన్ పాఠశాల విద్యార్థులు పతకాల పంట పండించారు.అండర్-14 విభాగం 600 మీటర్ల పరుగు పందెంలో పాఠశాలకు చెందిన జి. శ్రీరంగ కుమార్ మొదటి స్థానంలో నిలిచి స్వర్ణ పతకం సాధించగా, ఎస్. కార్తీక్ మూడో స్థానంతో కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. అలాగే 200 మీటర్ల పరుగు పందెంలో బి. హానిత్ రెండో స్థానంలో నిలిచి రజత పతకాన్ని గెలుపొందాడు. జిల్లా స్థాయిలో ప్రతిభ చాటి పాఠశాలకు పేరుప్రతిష్టలు తెచ్చిన ఈ ముగ్గురు క్రీడాకారులను, వారికి శిక్షణ నిచ్చిన ఉపాధ్యాయులను పాఠశాల యాజమాన్యం ప్రత్యేకంగా అభినందించింది..

## ఆగస్టు 1న కిర్లంపూడిలో ముద్రగడ పద్మనాభం సంతాప సభ

**అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి: మాజీ మంత్రివర్యులు మాజీ పార్లమెంటు సభ్యులు గౌరవ తోట నరసింహం గారు పిలుపునిచ్చారు**




కాకినాడ జిల్లా, జగ్గంపేట, జూలై 28 నేటి శుభోదయ: జగ్గంపేట మండలంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి తోట నరసింహం మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యుడు, ఉద్యమ స్ఫూర్తి ప్రదాత ముద్రగడ పద్మనాభం ఈ నెల 14న కన్నుమూయడం రాష్ట్రానికి తీరని లోటని అన్నారు. ఆయనకు నివాళిగా అభిమానులు, ఆత్మీయులు, స్నేహితులు, వివిధ వర్గాల ప్రజల ఆధ్వర్యంలో ఆగస్టు 1వ తేదీన (శనివారం) కిర్లంపూడిలోని ముద్రగడ పద్మనాభం స్వగృహం సమీపంలో భారీ సంతాప సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.ముద్రగడ పద్మనాభం మరణానంతరం రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, అభిమానులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారని తోట నరసింహం పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ రాష్ట్రం నుంచి కూడా పలువురు ప్రముఖులు వచ్చి ఆయనకు నివాళులర్పించడం ఆయన ప్రజాదరణకు నిదర్శనమని అన్నారు.ముద్రగడ పద్మనాభంతో అనుబంధం ఉన్న ప్రతి ఒక్కరూ, అభిమానులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఆగస్టు 1న జరిగే సంతాప సభకు హాజరై ఆయనకు ఘనంగా నివాళులర్పించాలని తోట నరసింహం పిలుపునిచ్చారు.

## డోర్ టు డోర్ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్

**ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో కారంపూడి మండలంలో విస్తృత ప్రచారం**



నేటి శుభోదయ 28 జూలై పల్నాడు జిల్లా కారంపూడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి ఆదేశాల మేరకు, మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తైన సందర్భంగా చేపట్టిన ప్రతిష్టాత్మక డోర్ టు డోర్ కార్యక్రమం కారంపూడి మండలంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని, ప్రభుత్వం వాటి పరిష్కారానికి కట్టుబడి ఉందని వారు తెలిపారు.

## జగ్గంపేటలో "రెండేళ్ల నమ్మకం" ఇంటింటికి తెలుగుదేశం

- రోజుకు 2 గ్రామాలు పర్యటిస్తా, రచ్చబండతో

ప్రజా సమస్యల పరిష్కారం... ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కాకినాడ జిల్లా, జగ్గంపేట, జూలై 28 నేటి శుభోదయ: జగ్గంపేట లో స్థానిక రావులమ్మ నగర్ లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జగ్గంపేట నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశానికి జగ్గంపేట శాసనసభ్యులు, టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ అధ్యక్షత వహించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా "రెండేళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం" కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు."ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి. రోజుకు రెండు గ్రామాల చొప్పున పర్యటిస్తాను. ప్రతి గ్రామంలో రచ్చబండ ఏర్పాటు చేసి ప్రభుత్వం చేసిన అభివృద్ధితో పాటు ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తాను అని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు.గ్రామాల్లో రైతులకు ఉపయోగపడే విధంగా గ్రావెల్ పుంత రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. ఏ గ్రామంలో ఎంత మేర గ్రావెల్ రోడ్లు అవసరమో కార్యకర్తలు గుర్తించి జాబితా అందించాలి అని అన్నారు.ఈ సమావేశంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, పోతుల మోహనరావు, కొత్త కొండబాబు, పిల్లా చంటిబాబు, అడబాల భాస్కరరావు, ఉంగరాల రాము, తోట రవి, తోట గాంధీ, జంపన సీతారామచంద్ర వర్మ, క్లస్టర్ ఇన్చార్జులు, యూనిట్ ఇన్చార్జి, బూత్ ఇన్చార్జిలు నియోజకవర్గంలోని ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్తూ.. డోర్ టు డోర్ ప్రచారానికి విశేష స్పందన

నరవాడపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి.. ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలపై ఆరా



కారంపూడి, జూలై 28 నేటి శుభోదయ పల్నాడు జిల్లా :పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని కారంపూడి మండలం నరవాడపాడు గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చేపట్టిన ప్రతిష్మాత్మక డోర్ టు డోర్ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు శ్రీ నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, మాచర్ల ఎమ్మెల్యే శ్రీ జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాల లబ్ధి అందుతున్నదా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల తల్లులకు 'తల్లికి వందనం' పథకం అందిందా లేదా అనే విషయంపై ఆరా తీశారు.ఈ కార్యక్రమంలో భాగంగా



నరవాడపాడులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని పలు కుటుంబాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ సాతులూరి కుమార్, రాష్ట్ర వాణిజ్య శాఖ కార్యదర్శి పంగులూరి పుల్లయ్య, తెలుగుదేశం పార్టీ నాయకులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ లక్ష్మీ మౌనిక, సీహెచ్ఓ ఫాతిమా, హెల్త్ అసిస్టెంట్ లాలూ నాయక్, పీహెచ్ఎల్ మస్తాన్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తోలేటి రామయ్య గారి వర్ధంతి

### అన్న క్యాంటీన్లో ఉచిత బోజనాలు హాజరైన ప్రముఖులు



కాకినాడ జిల్లాజగ్గంపేట జులై 28 నేటి శుభోదయ :జగ్గంపేట లో స్థానిక గోకవరం రోడ్డు లో గల అన్నా క్యాంటీన్ లో మల్లేపల్లి గ్రామ మాజీ గ్రామాధికారి , కీర్తిశేషులు తోలేటి రామయ్య , పార్వతి గార్ల 17 వ వర్ధంతి సందర్భంగా తెలుగుదేశం మండల అధ్యక్షులు జీను మణి బాబు , కాపు సంక్షేమ సంఘం అధ్యక్షులు మీసాల చిన్నబాబు , పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ బండారు రాజా , తెలుగు యువత అధ్యక్షులు రాయి సాయి , మాజీ ఎంపీటీసీ సభ్యులు వేములకొండ జోగారావు చేతుల మీదుగా ఉచిత భోజనాలను ప్రజలకు వడ్డించిరి .ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ మల్లేపల్లి గ్రామంలో మునసబుగ అత్యున్నత సేవలు అందించిన తోలేటి రామయ్య గారి మధుర స్మృతులు మరువలేమనే , వారి ఆశయాలను అందరకు ఆదర్శనీయ మని పేర్కొన్నారు. రామయ్య కుమారుడు వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ , పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు తోలేటి సూర్యనారాయణ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా మా తల్లిదండ్రుల వర్ధంతులకు బడిలో ను, గుడిలోనూ ఉచిత భోజనాలు పెట్టే వారమని అక్కడ కేవలం భక్తులు , విద్యార్థులు మాత్రమే తింటే ఇక్కడ అన్ని మతాలు , కులాలకు చెందిన అతి నిరు పేదలకు అన్నం పెట్టడం ఎంతో సంతోషాన్ని , ఆనందాన్ని ఇచ్చినదని తెలిపిరి. ఈ కార్యక్రమంలో మారిశెట్టి రాధా , తోలేటి శివరామకృష్ణ , వెత్సా నాగ సత్య , ఎం. మల్లేశ్వర రావు , జాజుల అచ్యుతేశ్వర రావు , కోడూరు సతీష్ , వెంకట్ పలువురు వాకర్సు. పెన్షనర్లు , కాపు సంఘ ప్రతినిధులు , తోలేటి రామయ్య గారి బంధుమిత్రులు , కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## నగరవ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై ఆకస్మిక ప్రత్యేక తనిఖీలు



విజయవాడ, జూలై 28 (నేటి శుభోదయ):-నగరవ్యాప్తంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు విజయవాడ నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ ఇంచార్జి డాక్టర్ గోపాల్ నాయక్ తెలిపారు. మంగళవారం నగరంలోని మూడు సర్కిళ్ల పరిధిలో ఆకస్మిక ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సర్కిల్ కి 18, మొత్తం 48 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి మార్కెట్లు, హోల్‌సేల్ దుకాణాలు, రిటైల్ షాపులు, సూపర్ మార్కెట్లు, వాణిజ్య సంస్థలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో మొత్తం 640.9 కేజీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై రూ. 5,56,350 విధించినట్లు వెల్లడించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను విక్రయించడం, నిల్వ చేయడం లేదా వినియోగించడం చట్టవిరుద్ధమని, ఇటువంటి ఉల్లంఘనలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలతో పాటు అవసరమైతే ట్రేడ్ లైసెన్సులు కూడా రద్దు చేసే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.120 మైక్రాన్ల కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ వస్తువులు పర్యావరణానికి తీవ్ర హాని కలిగిస్తాయని, డ్రైనేజీ వ్యవస్థలు మూసుకుపోవడానికి, భూకాలుష్యం పెరగడానికి ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. అందువల్ల వ్యాపారులు, ప్రజలు గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు, పేపర్ కవర్లు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను వినియోగించాలని సూచించారు.నగరాన్ని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఇటువంటి ఆకస్మిక ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.ఈ ప్రత్యేక తనిఖీల్లో మూడు సర్కిళ్లకు చెందిన శానిటరీ సూపర్వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటేషన్ సెక్రటరీలు, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో కూటమి డోర్-టు-డోర్ . గద్దె కాంతికుమార్



విజయవాడ, జూలై 28 (నేటి శుభోదయ):-చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా తలపెట్టిన డోర్-టు-డోర్ కార్యక్రమం రెండో రోజు మంగళవారం పండుగ వాతావరణంలో ఘనంగా జరిగిందని తెలుగుదేశం యువనేత గద్దె క్రాంతికుమార్ పేర్కొన్నారు. తూర్పులోని రెండవ డివిజన్ లో డోర్-టు-డోర్ కార్యక్రమంలో గద్దె క్రాంతి పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రెండేళ్లలో చేసిన అభివృద్ధి సంక్షేమాల గురించి వివరించి ప్రజల నుండి కూడ ప్రభుత్వంపై అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ రెండేళ్ల కూటమి పాలనపై చేపట్టిన డోర్-టు-డోర్ కార్యక్రమంలో ప్రజలకు కూటమి పాలన విజయాలను వివరించడానికి వెళుతుంటే ప్రజలే తమకు ఎదురొచ్చి వారికి అందిన సంక్షేమం గురించి, తమ ప్రాంతంలో జరిగిన అభివృద్ధి గురించి చెబుతున్నారని వెల్లడించారు. రాష్ట్రాభివృద్ధి విషయంలో చంద్రబాబు, పవన్, లోకేష్ లు ఏ విధంగా పనిచేస్తున్నారో కళ్లారా చూస్తున్నామని, కంపెనీలు తీసుకురావడానికి వారు పడుతున్న శ్రమను తెలుసుకుంటున్నామని, ఉద్యోగాల కల్పనకు వారి చర్యలు సఫలీకృతమవుతున్నాయని, ప్రజలు తమకు చెబుతున్నారన్నారు. పాతిక లక్షల ఉద్యోగాల కల్పన కొరకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. మరో ప్రక్క సంక్షేమం అమలు తీరు గురించి కూడా ప్రజలు సంతృప్తిగా ఉన్నారిన గద్దె క్రాంతి తెలిపారు. ప్రతినెలా 1వ తేదీన సామాజిక పింఛన్లు పడుతున్నాయని, ఉచిత బస్సు పథకం చదువుకుంటున్న ఆడపిల్లలకు వరంలాగా ఉందని, తల్లికి వందనం ఎంతో సహకారంగా ఉందని వారు తెలియజేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ లో చెప్పిన వాటితో పాటు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రణాళికలు చేస్తోందని తెలిపారు. ప్రజలు కూడ మరిన్ని సూచనలు తెలియజేయవచ్చునని, తమ ప్రాంత సమస్యలను తెలుపవచ్చునని క్రాంతి చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, రెండవ డివిజన్ టిడిపి అధ్యక్షులు దాసరి గాబ్రియల్, 2వ డివిజన్ అబ్జర్వర్ గద్దె ప్రసాద్, సుగసాని రత్నశ్రీ కృష్ణ ప్రసాద్, ముత్యాల కృష్ణ కిషోర్, ఎలమంచిలి రాజశేఖర్, కొండిపాటి శ్రీకృష్ణ, దేవరపల్లి శ్రీహరి, దోమకొండ రవికుమార్, ఇంకా బూత్, యూనిట్, క్లస్టర్ ఇన్'చారిజలు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## ఇంటింటికి తెలుగుదేశం"ను ప్రజా ఉద్యమంగా విజయవంతం చేయాలి.

ప్రతి ఇంటికీ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చేరవేయండి. బొండా ఉమా



విజయవాడ, జూలై 28 (నేటి శుభోదయ):-అజిత్ సింగ్‌నగర్‌లోని సెంట్రల్ ఎమ్మెల్యే కార్యాలయంలో 63వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పాల్గొని మాట్లాడుతూ "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, పారదర్శక పాలన, మౌలిక వసతుల కల్పన, విద్య, వైద్యం, వ్యవసాయం, మహిళా సాధికారత, యువతకు ఉపాధి అవకాశాల వంటి అంశాలను ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు.అదేవిధంగా సూపర్ సిక్స్ హామీల అమలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలను వివరించి ప్రభుత్వంపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని తెలిపారు.సెంట్రల్ లో రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి పనులు, రోడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాల మెరుగుదల, విద్యా--వైద్య రంగాల్లో చేపట్టిన చర్యలు, ప్రజల సంక్షేమం కోసం అందించిన ఆర్థిక సహాయం, నియోజకవర్గానికి తీసుకువచ్చిన నిధులు, కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని ఉమా సూచించారు.ప్రజలు తెలిపిన సమస్యలను ఓర్పుగా విని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ కార్యక్రమం అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కోరారు.అలాగే మీణూ యాప్‌లో ప్రతి ఇంటి సందర్శన వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, ప్రజల అభిప్రాయాలు, సమస్యలు, ప్రభుత్వ పథకాల లబ్ధి వంటి సమాచారాన్ని కచ్చితంగా నమోదు చేసి పార్టీ బలోపేతానికి తోడ్పడాలని కార్యకర్తలకు ఉమా సూచించారు. "ఇంటింటికి తెలుగుదేశం" కార్యక్రమం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి కుటుంబానికి చేరవేసే సమర్థవంతమైన వేదికగా నిలుస్తుందని ఉమా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ అధ్యక్షులు లబ్బా వైకుంఠం, ప్రధాన కార్యదర్శి కోలా శ్రీను, ఇంచార్జ్ మోత్కూరి కాసిం, లబ్బా దుర్గా, పైడి శ్రీను, మోదుగుల గణేష్, బెజ్జం జైపాల్, ఎస్కే అన్వర్, బాజీ, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, భూత్ ఇంచార్జులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్ ను ఆవిష్కరించిన బల్లా పల్లవి






అనంత పురం బ్యూరో జూలై 28 నేటి శుభోదయ :డాగురే ఫోటో ఒ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, అనంతపురం ఆధ్వర్యంలో నిర్వహించనున్న క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్‌ను అనంతపురం మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి ఆవిష్కరించి, టోర్నమెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేయవలసిందిగా అసోసియేషన్ సభ్యులు ఆహ్వానించడం జరిగింది. టోర్నమెంట్ విజయవంతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులకు మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లాపల్లవి ధన్యవాదాలు తెలియజేశారు.

## పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి



విజయవాడ, జులై 28 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ )సీడ్ బాల్స్ లను అనువైన ప్రదేశాలలో నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషిచేయాలని విద్యార్థినులు పిలుపునిచ్చారు. మంగళవారం శ్రీ దుర్గమల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ప్రకృతి పరిరక్షణ దినోత్సవం, ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పోస్టర్ ప్రజంటేషన్,సీడ్ బాల్స్ తయారీ,ప్లాస్టిక్ వ్యర్థలను పునర్వినియోగించి పక్షుల గూళ్ళు, ఆహరపాత్రాల తయారీలను చేసి చూపించారు.విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని సృజనాత్మకతను, విన్నూత్న ఆలోచనలను ప్రదర్శించారు.పర్యావర్యన సమతుల్యతను కాపాడడంలో పులుల ప్రాముఖ్యత వాటి సంరక్షణ అవసరాన్ని విపులగా వివరించారు.కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వి.దుర్గావతి, అధ్యాపకులు డాక్టర్ కళ్యాణి,అనిత హేమశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



## విశాఖపట్నం: కోటి గాజులతో 89 అడుగుల వినాయకుడి విగ్రహం..



( నేటి శుభోదయ జులై : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) వినాయక చవితి పండుగ సమీపిస్తుండటంతో దేశవ్యాప్తంగా గణేషుడి విగ్రహాల తయారీ ప్రక్రియ మొదలైంది. వీధివీధిలో.. వాడవాడలా వివిధ రూపాలలో వినాయకుడు కొలువు తీరనున్నాడు.ఈ క్రమంలోనే విశాఖపట్నంలో వినూత్న శైలిలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నారు. గాజువాక ప్రాంతంలోని శ్రీనగర్‌లో కోటికి పైగా గాజులతో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. విశాఖపట్నానికి చెందిన ఎస్‌వి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ, కోటికిపైగా గాజులను ఉపయోగించి.. శ్రీ దివ్య కంకణ అలంకార మహా గణపతి పేరుతో 89 అడుగుల ఎత్తైన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తోంది. గతంలో ఇదే గాజువాక ప్రాంతంలోని లంకా గ్రౌండ్స్‌లో లక్ష కాటన్, పట్టు చీరలతో శ్రీ సుందర వస్త్ర మహా గణేశ పేరుతో 89 అడుగుల ఎత్తైన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు.మన సంప్రదాయానికి ప్రతీకలైన గాజులకు ప్రాధాన్యమిస్తూ గాజులతో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్ వి ఎంటర్ టైన్‌మెంట్స్‌కు చెందిన గణేష్ కుమార్ తెలిపారు. ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన కళాకారుల బృందం, వివిధ రంగుల మట్టి గాజులతో 89 అడుగుల ఎత్తైన వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ విగ్రహ తయారీలో చిన్న చెక్క దుంగలు, కేన్ వంటి పర్యావరణ అనుకూల పదార్థాలను ఉపయోగిస్తున్నారు. సెప్టెంబర్ 14వ తేదీ వినాయక చవితి పండుగకు కొన్ని వారాల ముందుగానే, ఆగస్టు 2026 నాటికి విగ్రహం తయారీని పూర్తి చేయనున్నారు.మరోవైపు గాజులకు ప్రసిద్ధి చెందిన ఉత్తరప్రదేశ్ నుంచి వినాయకుడి విగ్రహం తయారీకి కావాల్సిన గాజులను సేకరించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశాఖలో జరిగే గణేష్ ఉత్సవాల్లో ఈ విగ్రహం ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని, విశాఖతో పాటుగా చుట్టుపక్కల జిల్లాల నుంచి భక్తులు ఈ ప్రత్యేకమైన విగ్రహాన్ని దర్శించుకుంటారని వెల్లడించారు. మరోవైపు ఎస్‌వి ఎంటర్‌టైన్‌మెంట్స్ 2024లో విశాఖలో 89 అడుగుల ఎత్తుతో శ్రీ మహా ఉచ్ఛిష్ట గణపతి రూపంలో విగ్రహాన్ని ఏర్పాటు చేసింది.2023లో శ్రీ అనంత పంచముఖ మహా గణపతి రూపాన్ని నెలకొల్పారు. 2022లో కైలాస విశ్వరూప మహా గణపతి రూపంలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు కోటికి పైగా గాజులను ఉపయోగించి రూపొందించే ఈ వినాయకుడి విగ్రహం.. ఆధ్యాత్మికతను, అద్భుతమైన కళా నైపుణ్యాన్ని చాటిచెప్పనుంది.

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## నంది అవార్డులు మాదిరిగా... ముళ్ళపూడి అవార్డులు ఇవ్వాలి

- ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ ను " ఆంధ్ర బిర్లాగా " పిలిచేవారు
- నవంబర్ 1న రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రారంభించాలి
- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కు ఆయన జీవితం ఆదర్శం కావాలి
- ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ 105వ జయంతి సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ డిమాండ్



( నేటి శుభోదయ జులై : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ పేరు మీద ప్రతి సంవత్సరం నంది అవార్డులు మాదిరిగా ముళ్ళపూడి అవార్డులు ఇవ్వాలి. రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1న రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రారంభించాలి తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్, ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కోరారు. మంగళవారం ఉదయం బి ప్యాలెస్ హైట్స్ అపార్ట్మెంట్ పెద్దవాల్తేరు, విశాఖపట్నం లో ఆయన 105వ జయంతి సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ దేశానికి స్వతంత్రము రావడానికి నాలుగు రోజులు ముందు (11-08-1947) తణుకులో ఆంధ్ర షుగర్స్ ని స్థాపించారు. అప్పట్లో జనసంచారం లేని ఆ ప్రాంతాన్ని పరిశ్రమ స్థాపనకు ఎన్నుకోవడం ఒక సాహసం. మొదట్లో రోజుకి 600 టన్నులు క్రషింగ్ సామర్థ్యంతో స్థాపించిన కర్మాగారం అంచెలంచెలుగా ఎదిగి 6000 టన్నులకు చేరేలా కృషి చేశారు. 350 మంది ప్రారంభించిన ఆంధ్ర షుగర్స్ నేడు వేలాది మందికి ఉపాధి కల్పిస్తూ అభివృద్ధి పథంలో మరింత సాగుతుంది.1984 లో తణుకులోనే రాకెట్ ఇంధనం ప్లాంట్ ని అప్పటి ఉప రాష్ట్రపతి శంకర్ దయాల్ శర్మ చేతుల మీదుగా ప్రారంభింప చేసి పారిశ్రామిక ప్రగతిని మరింత ముందుకు తీసుకెళ్లారు. 24 ఏళ్ళ వయసులోనే ఆంధ్రా షుగర్స్ స్థాపించారు. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు కు ఆయన జీవితం ఆదర్శం కావాలని, ఆయన స్ఫూర్తితో పరిశ్రమలు పెట్టడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ శాసనసభ్యుడుగా 1955 నుంచి 1967 దాకా ఆయన సేవలు అందించారని, అలాగే మా తండ్రి గారైన స్వర్గీయ బి.వి.రామారావు ఎప్పుడూ ఆయన్ని తన గురువుగా భావించే వారిని మరియు ఆయన ను " ఆంధ్ర బిర్లాగా "పిలిచేవారని, ఈ సందర్భంగా తెలుగు శక్తి అధ్యక్షులు బి.వి.రామ్ గుర్తు చేసుకున్నారు.ఈ కార్యక్రమం లో బి.ఎస్.ప్రసాద్, బి.శివకుమార్, బి.వెంకట నాగ వివేక్, ఎర్ర సత్యనారాయణ, డాక్టర్ పప్పూర్ నికుంజ్, బొల్లినేని వెంకటేశ్వరరావు, ఎల్.వి.కే.చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## చాలానా కన్నా ప్రాణం మిన్న హెల్మెట్ ధరించండి:ఎస్సై విజయ్ కుమార్



బాపట్ల నేటి శుభోదయ(రవి కిరణ్) జులై 28: బాపట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ద్విచక్ర వాహనం తనిఖీలు నిర్వహించి అనంతరం వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చి చలానా కన్నా ప్రాణం మిన్న అని అన్నారు.రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల ప్రాణాలను కాపాడేందుకు జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఆదేశాలతో, పట్టణ సిఐ రాంబాబు సూచనల మేరకు బాపట్ల పట్టణ ఎస్సై విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం బాపట్ల పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ద్విచక్ర వాహనాలపై విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా హెల్మెట్ ధరించకుండా వచ్చిన వాహనదారులను ఆపి పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. అలాగే డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సి, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ వంటి వాహన పత్రాలను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ హెల్మెట్ అంటే అది బరువు కాదు, అది మన బాధ్యత. చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాలకు ముప్పు తెస్తుంది. అందుకే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి తమ ప్రాణాలను, కుటుంబ సభ్యుల భవిష్యత్తును కాపాడుకోవాలి అని ఆయన అన్నారు. హెల్మెట్ లేకపోతే, లైసెన్స్ లేకపోతే, పత్రాలు లేకపోతే చలానా కట్టేసి వెళ్ళిపోవచ్చు అనే ధీమాను మనసులోంచి తీసేయండి. చలానా కన్నా ప్రాణం మిన్న. ప్రజల రక్షణ కోసమే పోలీసులు ఈ తనిఖీలు చేస్తున్నాం అని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అతివేగంగా వాహనాలు నడపడం ప్రమాదకరమని, నిర్ణీత వేగంతోనే వాహనాలు నడపాలని సూచించారు. 18 ఏళ్ల లోపు మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారు పట్టుబడితే వాహన యజమానిపై కూడా కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ఒక బైక్ పై ముగ్గురు ప్రయాణించడం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి నిబంధనలను ఉల్లంఘిస్తే వాహనం సీజ్ చేయడంతో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రత దృష్ట్యా ఇలాంటి తనిఖీలు ఇకపై కూడా నిరంతరం కొనసాగుతాయని ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

## గుంటూరులో తుపాకులు,బుల్లెట్లు కలకలం

**నకిలీ ధ్రువ పత్రాలతో అక్రమ ఆయుధాలు, బుల్లెట్లు పొందిన వ్యక్తి అరెస్ట్**




నేటి శుభోదయ 28 జులై గుంటూరు జిల్లా :నిందితుడు తాడికొండ కి చెందిన విజయహర్ష గా గుర్తింపు,నిందితుడు వద్ద నుంచి 22 రైఫిల్,ఒక బోర్ షాట్ గన్,ఒక పిస్టల్ 50 బుల్లెట్లు, కారు స్వాధీనం నిందితుడు చిత్తూరు జిల్లాలోని శాప్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి విజయ హర్షగా గుర్తించిన పోలీసులు జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడేవారు ఎంతటివరైనా వదిలేదిలేదంటూ ఘాటుగా హెచ్చరికలు జారీ చేసిన ఎస్పీ వకుల్ జిందాల్ ఫోర్స్ షూటింగ్ కోసం అంటూ ధ్రువ పత్రాలు తీసుకొన్నట్లు తెలిపిన ఎస్పీ వకుల్ జిందాల్. విజయవాడఓ షాపింగ్ మాల్ లో మిస్ ఫైర్ అయినా ఘటనలో నిందితుడు విజయహర్శ కోసం చాలా రోజులుగా గాలిస్తున్న పోలీసులు అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఆయుధాలు పొందిన విజయ హర్షను అరెస్ట్ చేసిన నగరం పాలెం పోలీసులు నిందితుడు పైఅక్రమ ఆయుధ చట్టం 318(4)336(3)దీఅం సెక్షన్ 25(1) కింద కేసు నమోదు ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన,లోతుగా దర్యాప్తు చేస్తున్న పోలీసులు పొన్నెకల్లు గ్రామంలోని ఒక వెంచర్ లో తుపాకులతో. నిందితుడు ప్రాక్టీస్ చేసినట్లు సమాచారం అందినట్లు తెలిపిన ఎస్పీ వకుల్ జిందాల్ ..

## భోగాపురం ఎయిర్పోర్ట్ తో నారా లోకేష్ కి సంబంధం ఏంటి

- భోగాపురం ఎయిర్పోర్ట్ నెల్లిమర్లి కాన్స్టెన్సీ లో ఉందా లేక మంగళగిరి కాన్స్టెన్సీ లో ఉందా. ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ భేటీ



( నేటి శుభోదయ జులై : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) భోగాపురం విమానాశ్రయంలో మంగళవారం మధ్యాహ్నం నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవితో తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రామ్ ఆమెతో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే పేరు పెట్టకపోతే ఇంకెవరి పేరు పెడతారని ప్రశ్నించారు?. భోగాపురం ఎయిర్పోర్ట్ నెల్లిమర్లి కాన్స్టెన్సీ లో ఉందా లేక మంగళగిరి కాన్స్టెన్సీ లో ఉందా. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చెప్పాలని తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. ఇక్కడ జరుగుతున్న బాగోతం అంతా మరొకసారి రాష్ట్రపతికి మరియు ప్రధానమంత్రి కి తెలియజేస్తానని రామ్ ఈ సందర్భంగా చెప్పారు.

## శ్రీ వారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి దంపతులు



( నేటి శుభోదయ జులై : 29 విశాఖపట్నం జిల్లా చీఫ్ బ్యూరో జగన్ ) తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి నీ మాజీ ఎమ్మెల్యే, దక్షిణ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త వాసుపల్లి గణేష్ కుమార్ దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆశాడ పౌర్ణమి రోజున శ్రీవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఆంధ్ర రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆయురారోగ్యాలతో ఉండాలని స్వామి వారిని వేడుకున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో మంచి పరిపాలన అందాలని శ్రీవారిని కోరారు. సింహాచలం నృసింహ స్వామి గిరిప్రదక్షణ లో లక్షలాదిమంది నడిచే భక్తుల సంకల్పం విజయవంతం కావాలన్నారు. 2029 ఎన్నికల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి రావాలని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు తమ అధినేత జగనన్న పై చల్లగా ఉండాలని వాసుపల్లి గణేష్ కుమార్ ఆకాంక్షించారు. తిరుమల అభివృద్ధికి వైసిపి హయాంలో ప్రతిష్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. మళ్లీ స్వామివారి ఆశీస్సులతో వచ్చే వైసీపీ ప్రభుత్వంలో తిరుమల తిరుపతి దేవస్థానం అభివృద్ధికి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు.

## గుడివాడ ఆర్టీసీ బస్టాండ్ పనులను సమీక్షించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**-ఆగస్టు చివరికి స్లాబ్ పనులు పూర్తి...4 నెలల్లో నూతన బస్టాండ్ అందుబాటులోకి**



గుడివాడ, జులై 28( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) ప్రజల సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఉద్ఘాటించారు.గుడివాడ ప్రజల చిరకాల కల అయిన ఆర్టీసీ బస్టాండ్ నిర్మాణ పనులను గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం అధికారులతో కలిసి సమీక్షించారు. గుడివాడ ప్రజా వేదిక కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో ఆర్టీసీ డి.ఈ జగదీష్ బస్టాండ్ నిర్మాణ పురోగతిని ఎమ్మెల్యేకు వివరించారు.నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని, నిర్ణీత సమయానికల్లా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టు సంస్థ ఎస్ ఆర్ ఇదిఫీస్ పి వి టి లిమిటెడ్ ప్రతినిధులకు ఎమ్మెల్యే రాము స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ..."గుడివాడ ప్రజల భావోద్వేగంతో కూడుకున్న ఆర్ టి సి బస్టాండ్ సమస్యను కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుందన్నారు.బస్టాండ్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయనీ, ఆగస్టు నెలాఖరుకల్లా స్లాబ్ పనులు పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రాము తెలిపారు.మరో నాలుగు నెలల్లోపు నూతన బస్టాండ్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అంకితం ఇస్తామని స్పష్టం చేశారు.బస్టాండు మాత్రమే కాకుండా గుడివాడ ఆర్ టి సి డిపో కార్యాలయ భవన నిర్మాణానికి దాత అన్నే నరసింహారావు దంపతులు 3 కోట్ల రూపాయల భారీ విరాళం అందించారనీ, వారి దాతృత్వానికి ఎమ్మెల్యే రామ కృతజ్ఞతలు చెప్పారు. దాతల నిధులతో పాటు ప్రభుత్వం కేటాయించే నిధులతో ఆధునిక సౌకర్యాలతో కూడిన బస్టాండ్ బాగున నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని ఆయన తెలిపారు.బైపాస్ రోడ్డు, ప్రధాన రహదారులు, శివారు కాలనీల రోడ్ల సమస్యలను ఇప్పటికే పరిష్కరించామన్నారు. త్వరలో మెయిన్ రోడ్డు అభివృద్ధి పనులు కూడా ప్రారంభిస్తామని తెలిపిన ఎమ్మెల్యే రాము,గుడివాడ అభివృద్ధి మా ప్రధాన లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు.ఈ సమావేశంలో ఆర్టీసీ అధికారులు, ఎస్ ఆర్ ఇదిఫీస్ ప్రతినిధులు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## 25వ డివిజన్ లబ్ధిదారులకు 3,35,020 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బొండా ఉమా



విజయవాడ, జూలై 28 (నేటి శుభోదయ):- బిఆర్ టిఎస్ రోడ్డులోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ విప్, సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు 25వ డివిజన్కు చెందిన నలుగురు లబ్ధిదారులకు 3,35,020 విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి (జవీ=ఖీ) చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య చికిత్సల వల్ల కలిగే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయనిధిని ఎంతో సమర్థవంతంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకం ద్వారా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.సెంట్రల్ నియోజకవర్గ ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి అందించడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, దరఖాస్తుల పరిశీలన నుంచి చెక్కుల పంపిణీ వరకు వేగవంతంగా పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నా తన కార్యాలయం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, అవసరమైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం తరపున అన్ని విధాలా సహాయం అందేలా నిరంతరం కృషి చేస్తామని ఉమా స్పష్టం చేశారు.ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటికే వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా లభించిందని, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని బొండా ఉమా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఘంటా కృష్ణమోహన్, 25వ డివిజన్ అధ్యక్షులు మాచర్ల గోపి, మాచర్ల పావని, ఆంజనేయులు, సుబ్బారావు, తదితరులు.పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్




తాడేపల్లిగూడెం జులై 28 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్సీపీ చేపట్టిన రాష్ట్రవ్యాప్త నిరసన కార్యక్రమానికి తాడేపల్లిగూడెం నియోజకవర్గం నుంచి భీమవరంలో జరిగే నిరసన కార్యక్రమానికి భారీగా 20 కార్లు 25 మోటార్ సైకిల్ 100 మందితో భారీ ఊరేగింపుగా భీమవరం బయలుదేరు వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని తాడేపల్లిగూడెం వైసీపీ ఇంచార్జ్ వడ్డీ రఘురామనాయుడు జెండా ఊపి ప్రారంభించారు.వడ్డీ రఘురాం నాయుడు మాట్లాడుతూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడి విద్యార్థుల భవిష్యత్తు నాశనం చేసిన కూటమి ప్రభుత్వం అంతం అవ్వాలని, డిఎస్సి లో జరిగిన అవకతవకలపై ఎంక్వైరీ కమిటీ వేసి నిజ నిజాలు నెగ్గ తేల్చి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ను భర్త రఫ్ చేయాలని డిమాండ్ చేశారు.విద్యార్థుల విద్యా హక్కులను పరిరక్షించాలని, వారి భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకూడదని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు సంబంధించిన సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపీ యువజన నాయకులు, విద్యార్థులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసనకు తమ సంఘీభావాన్ని తెలిపారు.

## కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తో రేవంత్ రెడ్డి, ఖమ్మం ఎంపీ రఘురాం రెడ్డి, తదితరుల భేటీ



న్యూఢిల్లీ, నేటి శుభోదయ ::: ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, తదితర ఎంపీలతో కలిసి కేంద్ర వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్తో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్రానికి చెందిన పలు కీలక గ్రామీణాభివృద్ధి అంశాలు, గృహ నిర్మాణం, ఉపాధి హామీ పథకాల విస్తరణపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో గ్రామీణ గృహనిర్మాణ రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని ఈ సందర్భంగా కేంద్ర మంత్రికి రేవంత్ వివరించారు. ఈసారి నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు 'ప్రధాని ఆవాస్ యోజన - గ్రామీణ్' (పిఎంఏవై -జి ) 2.0 కింద తెలంగాణకు 11.56 లక్షల ఇళ్లను కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఉపాధి హామీ (విబి -జి ఆర్ఏఎం -జి ) జాబితాలో చేర్చి, దానిద్వారా లబ్ధిదారులకు 90 రోజుల పాటు పని కల్పించి ఆర్థిక భరోసా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.ఎల్నినో ప్రతికూల పరిస్థితుల వల్ల దెబ్బతింటున్న గ్రామీణ కుటుంబాలను, రైతులను ఆదుకునేందుకు ఉపాధి హామీ పథకం పరిధిని విస్తరించాలని రేవంత్ రెడ్డి కోరారు. కూరగాయల పందిళ్లు, పశుగ్రాస ప్లాట్ల పెంపకం, మల్బరీ తోటలు, పట్టు పురుగుల పెంపక షెడ్ల నిర్మాణాలతో పాటు భూముల అభివృద్ధి, నీటి సంరక్షణ పనులను ఈ పథకం కింద అనుమతించాలని కోరారు. అలాగే ప్రకృతి వైపరీత్యాల వల్ల దెబ్బతిన్న వ్యవసాయ భూముల పునరుద్ధరణ పనులను కూడా ఇందులో చేర్చి, రైతాంగానికి, గ్రామీణ ఉపాధి రంగానికి కేంద్రం తగిన సహాయసహకారాలు అందించాలని విన్నవించారు.

## "తొలి దశ విజయవంతం మలిదశ అప్రమత్తం ప్రతి ఒక్కరు జాబితాలో ఉండేలా జాగ్రత్త వహించాలి..

**డ్రాఫ్ట్ జాబితాను జాగ్రత్తగా పరిశీలించాలి ఎస్ ఐ ఆర్ కార్యాలయం బిజెపి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి బృంద సభ్యులు**

కోమటి రవికుమార్" తాడేపల్లిగూడెం జూలై 28 (అవినాష్ మారంపూడి నేటి- శుభోదయ):::: ఓటర్ల జాబితాల సమగ్ర సవరణ సమీక్ష నమోదు కార్యక్రమం విజయవంతంగా ముగించడం పట్ల బిజెపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి రక్షణ వ్యక్తం చేశారు. బిజెపి తరపున బిఎల్ఏ లుగా బాధ్యతలు నిర్వహిస్తున్న ప్రతినిధులకు అభినందనలు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు హోటల్లో జాబితాలో నమోదు కావాల్సిందేనని, ఇదే మన విజయానికి మూలం అని బిజెపి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి అన్నారు. తాడే పల్లిగూడెం కిరాణా వర్తక సంఘ భవనశీ లో మంగళవారం జరిగిన ఎస్ ఐ ఆర్ కార్యశాలకు జిల్లా ప్రధాన కార్యదర్శి, నియోజవర్గ బి ఎల్ ఏ -1 దత్తు ప్రసాద్ అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ తొలిజేసి కార్యక్రమం లో బి ఎల్ ఏ లు ఎంతో కష్టించి బాధ్యతలు నిర్వర్తించారన్నారు.

## గుడివాడ పి. ఎ. సి. ఎస్.లలో కోట్లాది అవినీతి... అధికారులతో ఎమ్మెల్యే రాము సమీక్ష

**-నందివాడ పి ఎ సి ఎస్, గుడివాడ మున్సిపల్ సొసైటీలో భారీ స్కామ్ఉదాసీనత వహిస్తే విజిలెన్స్ ఎంక్వైరీ: ఎమ్మెల్యే రాము హెచ్చరిక -కేడీసీసీ చైర్మన్ నెట్టెం రఘురాంతో ఎమ్మెల్యే రాము ఫోన్ లో చర్చ**



గుడివాడ, జులై 28 ( అజయ్ నారగాని -నేటి శుభోదయ ) అమాయక రైతులు, కార్మికుల సొమ్ము దోపిడీ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రతిష్టకు మచ్చ తెచ్చేవారు ఎంతటి వారైనా ఉపేక్షించే ప్రసక్తి ఉండదని ఆయన స్పష్టం చేశారు.గుడివాడ నియోజకవర్గంలోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, కోఆపరేటివ్ సొసైటీలలో జరుగుతున్న అవినీతిపై గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మంగళవారం సహకార శాఖ అధికారులతో ప్రజా వేదిక కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ప్రజాధనం దుర్వినియోగం పట్ల ప్రభుత్వం ఉపేక్షించదన్న సంకేతం ఇచ్చారు.ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారి చంద్రశేఖర్ రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ సీఈఓ శ్యామ్ మనోహర్, డివిజనల్ కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఈశ్వర్, సూపరింటెండెంట్ హరినాథ్, కే. డి. సి.సి గుడివాడ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అన్ని స్థాయిల అధికారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి భారీ స్కాం పై తీసుకున్న చర్యలను ఆయన ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ...ముఖ్యంగా నందివాడ పి ఎ సి ఎస్ లో, గుడివాడ మున్సిపల్ కోఆపరేటివ్ సొసైటీ లో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందనీ,ఇంత పెద్ద స్కామ్ జరిగినా ఇంతవరకు ఎలాంటి కఠిన చర్యలు ఎందుకు తీసుకోలేదు అమాయక రైతులు, కార్మికులు కష్టపడి సంపాదించిన సొమ్మును నష్టపోతుంటే అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు.ఇప్పటికే ఉమ్మడి కృష్ణా జిల్లా కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాం తో ఫోన్ లో మాట్లాడాననీ, జరిగిన అవినీతిని ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు ఎమ్మెల్యే రాము చెప్పారు. స్థానికంగా ఉదాసీనత వహిస్తున్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయనను కోరనన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోతే, ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి విజిలెన్స్ ఎంక్వైరీ కొరతానని స్పష్టం చేశారు. కొందరు స్వార్థపరులు చేసే దోపిడీ వల్ల నిస్వార్థంగా కష్టపడే రైతు, సామాన్య కార్మికుడు బలవుతున్నాడనీ,ఇది ప్రభుత్వ ప్రతిష్టకు కూడా మచ్చ అని ఎమ్మెల్యే రాము ఆవేదన వ్యక్తం చేశారు.గుడివాడ నియోజకవర్గంలో ఇలాంటి స్కాములు మళ్లీ జరగకుండా పకడ్బందీ విధానం అమలు చేశారా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పి ఎ. సి. ఎస్ లో ఆడిట్ రికార్డులను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలనీ డిమాండ్ చేశారు.ప్రజల సొమ్ము ఒక్క రూపాయి కూడా వృథా కానివ్వమని ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు.సమావేశంలో ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, గుడివాడ మార్కెట్ యార్డ్ చైర్మన్ చాట్రగడ్డ రవికుమార్, నందివాడ టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, సహకార శాఖ అధికారులు కేడీసీసీ సీఈఓ శ్యాం మనోహర్, డిస్టిక్ కోపరేటివ్ ఆఫీసర్ చంద్రశేకర్ రెడ్డి పాల్గొన్నారు.



నవ శుభోదయ తెలుగు దినపత్రిక
బుధవారం - 29 - జూలై - 2026

# 2030 నాటికి భారత ఆర్థిక వ్యవస్థకు ఏఐ జోష్

## 500 బిలియన్ డాలర్ల సంపద సృష్టే లక్ష్యం!

ఐబీఎం – ఇండియాఏఐ సంయుక్త నివేదిక

భారతదేశం మరో పారిశ్రామిక విప్లవానికి వేదిక కాబోతోంది. 2030 నాటికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాంకేతికత దేశ ఆర్థిక వ్యవస్థకు ఏకంగా 500 బిలియన్ డాలర్లకు పైగా అదనపు విలువను జోడించనుందని తాజా నివేదిక వెల్లడించింది. ఐబీఎం ఇన్‌స్టిట్యూట్ ఫర్ బిజినెస్ వాల్యూ, కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖకు చెందిన 'ఇండియాఏఐ' సంయుక్తంగా రూపొందించిన 'ప్రామిస్ టు పవర్: హౌ ఏఐ ఈజ్ రిడిఫైనింగ్ ఇండియా ఎకనామిక్ ఫ్యూచర్' అనే నివేదికలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి.



### ఆశయం గొప్పదే.. కానీ..

భారతదేశం ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన ఏఐ ఆధారిత ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని నివేదిక ఆశాభావం వ్యక్తం చేసింది. సర్వేలో పాల్గొన్న 73% మంది వ్యాపార దిగ్గజాలు 2030 నాటికి భారత్ ప్రపంచ ఏఐ లీడర్‌గా అవతరిస్తుందని నమ్ముతున్నారు. ఐదుగురు వ్యాపారవేత్తలలో నలుగురు ఏఐ పెట్టుబడులు నేరుగా దేశ జీడీపీ వృద్ధిని ప్రభావితం చేస్తాయని ధీమా వ్యక్తం చేశారు. అయితే, వాస్తవ పరిస్థితులు కొంత ఆందోళనకరంగా ఉన్నాయి. సర్వే చేసిన సంస్థల్లో 72% సంస్థలు అంతర్జాతీయ పోటీతో పోలిస్తే తాము ఏఐ అమలులో వెనుకబడి ఉన్నామని అంగీకరించాయి. ఆశయానికి, ఆచరణకు మధ్య ఉన్న ఈ అంతరాన్ని తగ్గించడమే ఇప్పుడు దేశం ముందున్న ప్రధాన సవాలు.

### 35 కోట్ల మంది నిపుణులు అవసరం

ఈ నివేదిక ప్రధానంగా నైపుణ్యాల కొరతను ఎత్తిచూపింది. 'ప్రస్తుతం కేవలం 30% మంది ఉద్యోగులకు మాత్రమే ఏఐ పరిజ్ఞానం ఉంది. 2030 నాటికి ఈ అవసరాలు తీరాలంటే దేశవ్యాప్తంగా 350 మిలియన్ల (35 కోట్లు) ఏఐ నిపుణులు అవసరమవుతారు' అని అంచనా వేసింది. కేవలం సాంకేతికత ఉండటం ముఖ్యం కాదు. ఆ సాంకేతికతను నడిపించే నైపుణ్యం గల మానవ వనరులు ఉండటమే అసలైన విజయమని నివేదిక పేర్కొంది.

### డేటా సార్వభౌమాధికారం

డేటా భద్రత, నియంత్రణ విషయంలో భారతీయ కంపెనీలు కఠినంగా ఉన్నాయి. 74% మంది ఎగ్జిక్యూటివ్‌లు డేటాపై పూర్తి నియంత్రణ ఉండాలని కోరుకుంటున్నారు. ఖర్చును తగ్గించుకుంటూనే పనితీరును మెరుగుపరచుకోవడానికి 10 మందిలో ఏడుగురు హైబ్రిడ్ క్లౌడ్ నమూనా వైపు మొగ్గు చూపుతున్నారు. స్వదేశీ క్లౌడ్ మౌలిక సదుపాయాలు లేకపోవడం (77%), డేటా నాణ్యత సరిగ్గా లేకపోవడం (57%) ఏఐ విస్తరణకు ప్రధాన అడ్డంకులుగా మారాయి. భారతదేశం కేవలం ఏఐ వినియోగదారుగా మాత్రమే కాకుండా సృష్టికర్తగా ఎదగాలంటే 'ఇండియాఏఐ ఫ్యూచర్ స్కిల్స్' వంటి కార్యక్రమాలు క్షేత్రస్థాయికి వెళ్లాలి. ముఖ్యంగా టైర్ 2, టైర్ 3 నగరాల్లో ఏఐ ల్యాబ్‌ల ఏర్పాటు ద్వారా మారుమూల ప్రాంతాల్లోని ప్రతిభను ఒడిసిపట్టాలి. అప్పుడే 500 బిలియన్ డాలర్ల కల సాకారమవుతుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు సమన్వయంతో పనిచేసి విప్లవాత్మక మార్పులు తెస్తేనే ఈ ఏఐ స్వప్నం సాకారం అవుతుందంటున్నారు.

# గూగుల్ ఉచిత స్టోరేజ్‌పై నియంత్రణ



టెక్ దిగ్గజం గూగుల్ తన వినియోగదారులకు షాకిచ్చేలా ఉచిత క్లౌడ్ స్టోరేజ్ విధానంలో కీలక మార్పులను చేపట్టింది. ఇప్పటివరకు కొత్తగా జీమెయిల్ ఖాతా తెరిచిన ప్రతి ఒక్కరికీ లభించే 15 జీబీ ఉచిత స్టోరేజ్ పరిమితిని కేవలం 5 జీబీకి తగ్గించేలా ఒక కొత్త విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలిస్తోంది. కొత్తగా గూగుల్ ఖాతా సృష్టించుకునే వారు తమ ఫోన్ నంబర్‌ను అనుసంధానం చేసి వెరిఫై చేయకపోతే కేవలం 5 జీబీ స్టోరేజ్ మాత్రమే లభిస్తుంది. ఈ విషయాన్ని ప్రముఖ టెక్ వేదిక 'ఆండ్రాయిడ్ అథారిటీ' ఆధ్వర్యంలో గూగుల్ అధికారికంగా ధ్రువీకరించింది. మొదట ఈ మార్పును ఒక రెడ్డిట్ వినియోగదారుడు గుర్తించి వెలుగులోకి తెచ్చారు.

### గూగుల్ వివరణ ఏమిటి?

ఉచిత స్టోరేజ్ పరిమితి తగ్గింపుపై వస్తున్న వార్తలపై గూగుల్ స్పందించింది. 'అత్యుత్తమ నాణ్యత కలిగిన క్లౌడ్ స్టోరేజ్ సేవలను నిరంతరాయంగా అందించడమే మా లక్ష్యం. అందులో భాగంగానే నిర్దిష్ట ప్రాంతాల్లో ఈ కొత్త స్టోరేజ్ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరీక్షిస్తున్నాం. దీనివల్ల భద్రత పెరగడమే కాకుండా, డేటా రికవరీ ప్రక్రియ మరింత సులభతరం అవుతుంది' అని గూగుల్ పేర్కొంది. అయితే, ఈ విధానాన్ని ప్రపంచవ్యాప్తంగా అందరికీ వర్తింపజేస్తారా లేదా అనే అంశంపై కంపెనీ ఇంకా ఎటువంటి తుది నిర్ణయం తీసుకోలేదు. ప్రస్తుతానికి ఈ నిబంధన కేవలం కొత్తగా క్రియేట్ చేసే ఖాతాలకు మాత్రమే వర్తిస్తుందని స్పష్టం చేసింది.

కొత్త స్టోరేజీ పాలసీ ఎలా పనిచేస్తుంది?

సాధారణంగా గూగుల్ ఖాతా ఉన్న ప్రతి ఒక్కరికీ జీమెయిల్, గూగుల్ డ్రైవ్, గూగుల్ ఫోటోస్ వంటి సేవలన్నింటికీ కలిపి ఉమ్మడిగా 15 జీబీ ఉచిత స్టోరేజ్ లభిస్తుంది. గూగుల్ ఎకోసిస్టమ్‌ను వాడటానికి వినియోగదారులను ఆకర్షించే అతిపెద్ద ఫీచర్ ఇదే.

### ప్రస్తుత పరీక్షల ప్రకారం..

డిఫాల్ట్ లిమిట్ – 5 జీబీ: కొత్త టెస్ట్ అకౌంట్ సిస్టమ్ కింద సైన్ అప్ అయ్యే వారికి ప్రాథమికంగా 5 జీబీ మాత్రమే ఉచితంగా ఇస్తున్నారు. పూర్తి 15 జీబీ పొందాలంటే: కొత్త వినియోగదారులు తప్పనిసరిగా తమ ఫోన్ నంబర్‌ను అందించి ఓటీపీ ద్వారా ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. అలా చేస్తేనే మిగిలిన 10 జీబీ అన్‌లాక్ అయి మొత్తం 15 జీబీ స్టోరేజ్ అందుబాటులోకి వస్తుంది.

### ఫోన్ నంబర్ వెరిఫికేషన్ ఎందుకు?

ఒక్కరే వందలాది నకిలీ (ఫేక్) ఖాతాలను సృష్టించి ఉచితంగా లభించే 15 జీబీ స్టోరేజ్ ఆఫర్లను దుర్వినియోగం చేయకుండా అడ్డుకోవడమే గూగుల్ ప్రధాన ఉద్దేశం. ఫోన్ నంబర్ లింక్ చేయడం ద్వారా ఒక వ్యక్తికి ఒకే ఉచిత స్టోరేజ్ ప్రయోజనం చేకూరుతుందని గూగుల్ భావిస్తోంది. అంతేకాకుండా వినియోగదారులు ఎప్పుడైనా తమ పాస్‌వర్డ్ మర్చిపోయినా లేదా ఖాతా హ్యాకింగ్‌కు గురైనా.. ఫోన్ నంబర్ ద్వారా సులభంగా రికవర్ చేసుకోవచ్చని కంపెనీ చెబుతోంది. ప్రస్తుతం ఆఫ్రికా వంటి కొన్ని ఎంపిక చేసిన అంతర్జాతీయ ప్రాంతాల్లో ఈ మార్పును వినియోగదారులు గమనించారు. భారతదేశంలోనూ కొత్త ఖాతా తెరిచే సమయంలో తప్పనిసరిగా ఫోన్ నంబర్ అడుగుతున్నట్లు కొందరు యూజర్లు సోషల్ మీడియా ద్వారా నివేదిస్తున్నారు.

### స్టోరేజీని గూగుల్ నిజంగానే తగ్గిస్తోందా?

ప్రస్తుతానికి గూగుల్ ఈ విధానాన్ని ఒక ప్రయోగంగా మాత్రమే చెబుతోంది తప్ప, ఉచిత స్టోరేజీని శాశ్వతంగా తగ్గిస్తున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా సెంటర్ల నిర్వహణ ఖర్చులు, వాటికి పెరుగుతున్న డిమాండ్ వల్లే టెక్ కంపెనీలు ఉచిత సేవలను పరిమితం చేస్తున్నాయనే ప్రచారం జరుగుతున్నప్పటికీ.. గూగుల్ దీనిని ధ్రువీకరించలేదు.

# మన శరీరంలో అనేక విధులను నిర్వహించే ఈ పోషక పదార్థం గురించి మీకు తెలుసా.. దీన్ని ఎలా పొందాలంటే..




మన శరీరంలో అనేక జీవక్రియలు సక్రమంగా నిర్వహించబడేందుకు, శరీరానికి శక్తి లభించేందుకు, రోగాలు రాకుండా ఉండేందుకు అనేక పోషకాలు సహాయం చేస్తాయి. కనుక అన్ని పోషకాలను మనం తరచూ అందేలా చూసుకోవాలి. అయితే పోషకాలు అంటే చాలా మంది విటమిన్ ఎ, బి12, విటమిన్ డి, సి లాంటివి చెబుతారు. అంత వరకు బాగానే ఉన్నా ఇంకా అలాంటి పోషకాలు చాలానే ఉన్నాయన్న సంగతి అనేక మందికి తెలియదు. మన శరీరానికి కేవలం విటమిన్లు మాత్రమే కాదు, అనేక మినరల్స్ కూడా అవసరం అవుతాయి. కనుక మినరల్స్ కూడా లభించేలా చూసుకోవాలి. ఇక మినరల్స్‌లో క్యాల్షియం, ఐరన్, పొటాషియం వంటివి చెబుతారు. కానీ ఇవే కాకుండా మన శరీరానికి కావల్సిన మినరల్స్ లో ఇంకా అనేకం ఉన్నాయి. వాటిల్లో సెలీనియం కూడా ఒకటి. సెలీనియం కూడా మన శరీరంలో ముఖ్య పాత్ర పోషిస్తుంది. అనేక జీవక్రియలకు ఇది అవసరం అవుతుంది.

### అనేక పనులు నిర్వహిస్తుంది..

మనకు నిత్యం అవసరం అయ్యే అనేక మినరల్స్‌లో సెలీనియం కూడా ఒకటి. దీని గురించి చాలా మందికి అవగాహన లేదు. అందువల్ల సెలీనియంను చాలా మంది తీసుకోరు. కానీ ఇది అనేక పనులను నిర్వహిస్తుంది. మన శరీరంలో అనేక జీవక్రియలకు సహాయం చేస్తుంది. మనల్ని ఆరోగ్యంగా ఉంచేందుకు తోడ్పడుతుంది. మన శరీర మెటబాలిజం పెరిగేందుకు సెలీనియం దోహదం చేస్తుంది. దీని వల్ల క్యాలరీలు ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. అలాగే రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. దీని వల్ల సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టవచ్చు. దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలు తగ్గుతాయి. సెలీనియం వల్ల థైరాయిడ్ పనితీరు మెరుగు పడుతుంది. థైరాయిడ్ ఉన్నవారికి సెలీనియం ఎంతో మేలు చేస్తుంది. అలాగే శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు సెలీనియం ఉండే ఆహారాలను తింటుంటే ఉపయోగం ఉంటుంది.

### యాంటీ ఆక్సిడెంట్ లాగే..

ఇక సెలీనియం మినరల్ అయినప్పటికీ ఇది యాంటీ ఆక్సిడెంట్‌లాగే పనిచేస్తుంది. రోజూ మన శరీరానికి తగినంత సెలీనియం లభించేలా చూసుకోవాలి. దీని వల్ల అనేక లాభాలను పొందవచ్చు. సెలీనియం యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. కనుక వైరస్ ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభించేలా చేస్తుంది. వైరస్ కారణంగా వచ్చే వ్యాధులు, జ్వరాలను తగ్గిస్తుంది. రోగ నిరోధక శక్తి పెరిగేలా చేస్తుంది. దీని వల్ల శరీరం ఇన్ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. వ్యాధులు రాకుండా చూస్తుంది. సెలీనియం తగినంతగా లభించకపోతే శరీరం తరచూ ఇన్‌ఫెక్షన్ల బారిన పడుతుంది. కనుక మన శరీరానికి సెలీనియం లభించేలా చూసుకోవాలి. సెలీనియం మనకు రోజుకు 70 నుంచి 80 మైక్రోగ్రాముల మోతాదులో అవసరం అవుతుంది. ఇది మనకు అనేక ఆహారాల్లో లభిస్తుంది.

### సెలీనియం ఉండే ఆహారాలు..

సెలీనియం మనకు సముద్రపు ఆహారంలో అధికంగా లభిస్తుంది. పీతలు, చేపలు, రొయ్యలు వంటి ఆహారాలను తింటుంటే సెలీనియంను పొందవచ్చు. అలాగే బాదంపప్పు, జీడిపప్పు, వాల్ నట్స్, పిస్తా, గుమ్మడి విత్తనాలు, పొద్దు తిరుగుడు విత్తనాలు, చియా విత్తనాలు, అవిసె గింజలు వంటి నట్స్, సీడ్స్‌లోనూ ఇది ఉంటుంది. చికెన్, కోడిగుడ్లు, పాలకూర, పుట్ట గొడుగులు వంటి ఆహారాలను తింటున్నా కూడా సెలీనియంను పొందవచ్చు. వెల్లుల్లి, ఆవాలు, ఆలివ్ ఆయిల్, బ్రోకలీ, ఓట్స్, మటన్ లివర్, పైన్ నట్స్ వంటి ఆహారాలను తినడం వల్ల కూడా సెలీనియం లభిస్తుంది. ఇలా ఆయా ఆహారాలను తరచూ తింటుంటే సెలీనియం లభించేలా చూసుకోవచ్చు. దీంతో అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

# పచ్చకామెర్లు ఉన్నవారు తీసుకోవాల్సిన ఆహారాలు ఇవే.. వీటి వల్ల త్వరగా కోలుకుంటారు..!





పచ్చ కామెర్లు వచ్చిన వారి శరీరం పసుపు రంగులో కనిపిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. కళ్లు కూడా పసుపు రంగులో దర్శనమిస్తుంటాయి. రక్తంలో బైలిరుబిన్ అనే సమ్మేళనం అధికంగా చేరడం వల్ల పచ్చ కామెర్లు వస్తాయి. ఇది పసుపు రంగులో ఉంటుంది కనుక శరీరం మొత్తం అదే రంగులోకి మారుతుంది. పచ్చ కామెర్లు వచ్చిన వారిని సులభంగా గుర్తించవచ్చు. ఈ క్రమంలోనే ఈ కామెర్లు ఉన్నవారు డాక్టర్లచే చికిత్స తీసుకోవాల్సి ఉంటుంది. వారు ఇచ్చే మందులను క్రమం తప్పకుండా వాడాలి. దీంతో కామెర్ల నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే ఆహారం విషయంలోనూ అనేక మార్పులు చేసుకోవాలి. పచ్చ కామెర్లు ఉన్నవారు పలు ఆహారాలను తీసుకోవడం వల్ల ఈ సమస్య నుంచి త్వరగా కోలుకుంటారు. శరీరానికి శక్తి లభించి ఉత్సాహంగా మారుతారు. మళ్లీ చురుగ్గా పనిచేస్తారు. అలాగే శరీరానికి పోషకాలు కూడా లభిస్తాయి.

### నీళ్లను అధికంగా తాగాలి..

పచ్చ కామెర్లు ఉన్నవారి లివర్ పై తీవ్ర ఒత్తిడి పడుతుంది. కనుక లివర్‌పై భారం పెంచని ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. నూనె పదార్థాలు, కారం, మసాలాలు అధికంగా ఉండే ఆహారాలను తినకూడదు. తాజా పండ్లు, కూరగాయలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వాలి. పచ్చ కామెర్లు ఉన్నవారు యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆహారాలను తింటుంటే ఎంతగానో మేలు జరుగుతుంది. ఈ వ్యాధి బారిన పడిన వారు శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. అందుకు గాను నీళ్లను అధికంగా తాగాల్సి ఉంటుంది. దీంతో ఆహారం కూడా సులభంగా జీర్ణం అవుతుంది. లివర్‌పై పడే భారం తగ్గుతుంది. శరీరంలోని వ్యర్థాలను లివర్ సులభంగా బయటకు పంపిస్తుంది. లివర్ ఆరోగ్యం మెరుగు పడుతుంది. దీంతో వ్యాధి నుంచి సులభంగా కోలుకుంటారు. ఈ క్రమంలో పచ్చ కామెర్లు ఉన్నవారు రోజుకు కనీసం 2 నుంచి 3 లీటర్ల వరకు నీళ్లను తప్పనిసరిగా తాగాల్సి ఉంటుంది.

### యాంటీ ఆక్సిడెంట్లు ఉండే ఆహారాలు..

పచ్చ కామెర్లు ఉన్నవారు తాజా పండ్లు, కూరగాయాలను తింటుండాలి. వీటిని పోషకాలకు గనిగా చెబుతారు. వీటిని తినడం వల్ల నీరసం, అలసట తగ్గుతాయి. ఉత్సాహంగా మారుతారు. యాక్టివ్‌గా ఉంటారు. వ్యాధి నుంచి త్వరగా కోలుకుంటారు. ముఖ్యంగా యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండే పండ్లు, కూరగాయలను తినడం వల్ల ఎంతో మేలు జరుగుతుంది. అన్ని రకాల పండ్లు, కూరగాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగానే ఉంటాయి. అయితే ద్రాక్ష, నారింజ, కివి, పైనాపిల్, యాపిల్, దానిమ్మ, నిమ్మ వంటి పండ్లతోపాటు టమాటాలు, చిలగడదుంపలు, క్యారెట్లు, పాలకూర, బీట్ రూట్ వంటి కూరగాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. కనుక వీటిని రోజూ తింటుంటే పచ్చ కామెర్లు ఉన్నవారికి ఎంతో మేలు జరుగుతుంది. ఆ వ్యాధి నుంచి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుంది.

### ఎంజైమ్‌లు ఉండే ఆహారాలు కూడా..

పచ్చ కామెర్లు ఉన్నవారు పలు ఎంజైమ్‌లు కలిగిన ఆహారాలను తీసుకుంటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. ముఖ్యంగా జీర్ణాశయానికి అవసరం అయ్యే ఎంజైమ్‌లు కలిగిన తేనె, పైనాపిల్, బొప్పాయి, మామిడి వంటి ఆహారాలను, పండ్లను తింటుంటే ఫలితం ఉంటుంది. వీటిని తినడం వల్ల జీర్ణాశయానికి కావల్సిన ఎంజైమ్‌లు లభిస్తాయి. ఇవి జీర్ణక్రియ సాఫీగా జరిగేలా చేస్తాయి. దీంతో జీర్ణ సమస్యలు తగ్గి జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. దీని వల్ల పచ్చ కామెర్లు త్వరగా తగ్గుతాయి. అలాగే ఈ వ్యాధి ఉన్నవారు రోజూ ఓట్స్, వాల్ నట్స్‌ను తింటున్నా కూడా ఎంతగానో ఉపయోగం ఉంటుంది. పచ్చ కామెర్లు ఉన్నవారు కొన్ని రకాల ఆహారాలకు దూరంగా ఉండాలి. ముఖ్యంగా వేపుళ్లను అసలు తినకూడదు. నూనె పదార్థాలు, ప్రాసెస్ చేయబడిన ఆహారాలు, మసాలాలు, కారం ఉండే ఆహారాలు, తీపి పదార్థాలను అసలు తినకూడదు. వీటిని తింటే లివర్‌పై భారం పడుతుంది. దీంతో లివర్‌లో కొవ్వు చేరి పచ్చ కామెర్లు మరింత ఎక్కువయ్యే ప్రమాదం ఉంటుంది. కనుక ఈ వ్యాధి ఉన్నవారు ఆహారం విషయంలో జాగ్రత్తలను పాటించాల్సి ఉంటుంది. దీని వల్ల వ్యాధి నుంచి త్వరగా కోలుకుని ఆరోగ్యంగా ఉండవచ్చు.

# భూమిని తాకే సూర్యరశ్మి తగ్గుతోంది!

## లండన్ అధ్యయనం హెచ్చరిక!

మానవాళి సాంకేతిక ప్రగతికి సూచికలుగా భావిస్తున్న ఉపగ్రహాలు, రాకెట్ ప్రయోగాలు.. ఇప్పుడు భూమి చుట్టూ ఉన్న పర్యావరణానికి కొత్త శాపంగా మారుతున్నాయి. నిరంతరాయంగా సాగుతున్న అంతరిక్ష ప్రయోగాలు ఎగువ వాతావరణాన్ని తీవ్రంగా కలుషితం చేస్తున్నాయని, దీనివల్ల భూమికి చేరే సూర్యరశ్మి పరిమాణం క్రమంగా తగ్గుతోందని బ్రిటన్‌కు చెందిన 'యూనివర్సిటీ కాలేజ్ లండన్'(యూసీఎల్) పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. ప్రఖ్యాత అంతర్జాతీయ జర్నల్ 'ఎర్త్ ఫ్యూచర్'లో మే 14న ప్రచురితమైన 'రేడియేటివ్ ఫోర్సింగ్ అండ్ ఓజోన్ డిప్లిషన్ ఆఫ్ ఎ డికేడ్ ఆఫ్ శాటిలైట్ మెగాకాన్స్టెలేషన్ మిషన్స్' అనే పరిశోధనా



### నియంత్రణ లేని జియో ఇంజినీరింగ్ ప్రయోగం!

యూనివర్సిటీ కాలేజ్ లండన్‌కు చెందిన శాస్త్రవేత్తలు కానర్ ఆర్.బార్కర్, ప్రొఫెసర్ ఎలోయిస్ ఎ.మరైస్, ఎరిక్ వై నేతృత్వంలోని బృందం 2020 నుంచి 2022 మధ్య కాలంలో జరిగిన రాకెట్ ప్రయోగాలు, అంతరిక్షంలో కాలం చెల్లిన ఉపగ్రహాల అవశేషాలపై సమగ్ర పరిశోధన చేసింది. 'రాకెట్ ప్రయోగాలు వాతావరణ కాలుష్యానికి ఒక ప్రత్యేకమైన మూలంగా మారాయి. ఇవి హానికరమైన రసాయనాలను నేరుగా ఎగువ వాతావరణ పొరల్లోకి విడుదల చేస్తున్నాయి. తద్వారా భూమిపై ఇప్పటివరకు అత్యంత స్వచ్ఛంగా భావించిన సహజ వాతావరణం కలుషితమవుతోంది' అని యూసీఎల్ ప్రధాన పరిశోధకుడు కానర్ బార్కర్ తెలిపారు. గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడానికి శాస్త్రవేత్తలు ప్రతిపాదించే కృత్రిమ 'జియో ఇంజినీరింగ్' పద్ధతుల తరహాలోనే.. ఈ ఉపగ్రహ ప్రయోగాల వల్ల విడుదలవుతున్న కాలుష్యం భూమిని తాకే సూర్యరశ్మిని అడ్డుకుంటోందని పరిశోధకులు తేల్చారు. ఇది భూమిపై స్వల్ప శీతలీకరణ ప్రభావాన్ని చూపినప్పటికీ పెరుగుతున్న ప్రపంచ ఉష్ణోగ్రతలతో పోలిస్తే ఇది చాలా తక్కువని, అయితే దీనివల్ల భవిష్యత్తులో ఊహించని తీవ్ర పర్యావరణ పరిణామాలు ఎదురవుతాయని ప్రాజెక్ట్ లీడ్ ప్రొఫెసర్ ఎలోయిస్ మరైస్ హెచ్చరించారు. పరిస్థితి చేతులు దాటిపోకముందే దేశాధినేతలు చర్యలు చేపట్టాలని ఆమె పిలుపునిచ్చారు.

### ఐదేళ్లలోనే మూడింతలైన ప్రయోగాలు

**రాకెట్ ప్రయోగాల్లో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులను ఈ నివేదిక గణాంకాలతో సహా విశ్లేషించింది.**

| సంవత్సరం | వార్షిక రాకెట్ ప్రయోగాల సంఖ్య |
|---|---|
| 2020 | 114 |
| 2025 | 329 |

ఈ భారీ వృద్ధికి ప్రధాన కారణం అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్ సంస్థ నిర్వహిస్తున్న స్టార్‌లింక్ మెగాకాన్స్టెలేషన్ ప్రాజెక్టేనని నివేదిక స్పష్టం చేసింది. ఇంటర్నెట్ సేవల కోసం స్పేస్ ఎక్స్ ఇప్పటివరకు కక్ష్యలోకి సుమారు 12,000 ఉపగ్రహాలను ప్రవేశపెట్టింది. ఈ దశాబ్దం ముగిసేనాటికి అంతరిక్షంలోకి మరో 65,000 ఉపగ్రహాలు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసినప్పటికీ, ప్రస్తుత వేగాన్ని చూస్తుంటే ఆ సంఖ్య అంతకంటే ఎక్కువే ఉండేలా కనిపిస్తోంది.



### ఎగువ వాతావరణంలో తిష్ఠ వేస్తున్న మసి

స్పేస్ ఎక్స్ సంస్థకు చెందిన ఫాల్కన్ 9 వంటి రాకెట్లు కిరోసిన్ ఆధారిత ఇంధనాన్ని ఉపయోగిస్తాయి. ఇవి మండటం వల్ల భారీ ఎత్తున 'నల్ల కార్బన్' లేదా 'మసి' కణాలు వాతావరణంలోకి విడుదలవుతాయి. భూమిపై అయితే వర్షాల వల్ల ఈ మసి కడిగివేయబడుతుంది, కానీ ఎగువ వాతావరణంలో గాలి ప్రసరణ చాలా నెమ్మదిగా ఉండటం వల్ల ఈ హానికరమైన మసి కణాలు అక్కడే దశాబ్దాల పాటు తిష్ఠ వేస్తున్నాయి.

### ప్రమాద ఘంటికలు

2029 నాటికి అంతరిక్ష పరిశ్రమ ద్వారా ఏటా దాదాపు 870 టన్నుల మసి వాతావరణంలోకి విడుదలయ్యే ప్రమాదం ఉంది. ఈ ప్రయోగాల వల్ల క్లోరిన్ వంటి రసాయనాలు కూడా విడుదలవుతున్నాయి. అయితే ప్రస్తుతానికి కిరోసిన్ ఇంధన రాకెట్ల వల్ల విడుదలయ్యే క్లోరిన్ పరిమాణం తక్కువగా ఉండటం వల్ల ఓజోన్ పొరపై దీని ప్రభావం స్వల్పంగానే ఉంది. కానీ, భవిష్యత్తులో ప్రయోగాలు పెరిగితే ముప్పు తప్పదు.

### మున్ముందు మరింత పోటీ!

ప్రస్తుతం అంతరిక్ష రంగంలో వాణిజ్య పోటీ విపరీతంగా పెరుగుతోంది. కేవలం స్పేస్ ఎక్సే కాకుండా అమెజాన్ సైతం తన సొంత ఇంటర్నెట్ ఉపగ్రహ నెట్‌వర్క్ 'లియో'ను అభివృద్ధి చేసే పనిలో పడింది. అటు చైనా కూడా 'గువాంగ్' పేరుతో భారీ ఉపగ్రహ సమూహాన్ని నిర్మించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో రాబోయే రోజుల్లో వేలాది ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపడానికి మరిన్ని వందల రాకెట్ ప్రయోగాలు అవసరమవుతాయి. అంతరిక్ష సాంకేతికత వైపు ప్రపంచ దేశాలు అడుగులు వేస్తున్న తరుణంలో.. పర్యావరణ సమతుల్యతను కాపాడుకునేలా కఠిన నిబంధనలు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఈ అధ్యయనం నొక్కి చెప్పింది.

# స్పెషల్ ఎట్రాక్షన్



కమర్షియల్ సినిమాలో హీరో ఉంటారు. ఫైట్స్, పాటలు ఉంటాయి. అయినా అదనపు ఆకర్షణ కావాలి. ఆడియన్స్ కోసం ఓ ప్రత్యేక గీతం థియేటర్స్‌లో ప్లే అవ్వాలి. అందుకే కొందరు హీరోలు స్టోరీలో స్పెషల్ సాంగ్ చేసే స్కోప్ ఉంటే, సై అంటున్నారు. ఆ పాటలు చేయడానికి హీరోయిన్లు కూడా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారు. ప్రేక్షకులను ఉత్సాహపరిచే స్టెప్పులు వేస్తున్నారు. మరి... ఏ సినిమాలో ఏ నటి స్పెషల్‌గా కనిపించనున్నారో ఓసారి లుక్ వేయండి.









జైలర్‌తో స్టెప్పుల్

మంచి కమర్షియల్ మోడ్‌లో కనిపిస్తున్నారు రజనీకాంత్. ఈ సీనియర్ హీరో నటించిన గత రెండు చిత్రాలు 'జైలర్, కూలీ' కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌గా ఆడియన్స్‌ను అలరించాయి. అలాగే ఈ రెండు చిత్రాల్లోనూ స్పెషల్ సాంగ్స్ ఉన్నాయి. 'జైలర్' చిత్రంలోని 'కావాలయ్యా..' పాటలో తమన్నా అదిరిపోయే స్టెప్పులు వేస్తే, 'కూలీ' చిత్రంలోని 'మోనికా..' పాటలో పూజా హెగ్డే డ్యాన్స్ మూమెంట్స్‌ను ఇరగదీశారు. కాగా రజనీకాంత్ పూర్తి చేసిన తాజా చిత్రం 'జైలర్ 2'లోనూ ఓ స్పెషల్ సాంగ్ ఉంది. ఈ సాంగ్‌ను బాలీవుడ్ నటి నోరా ఫతేహీ చేశారు. ఆల్రెడీ ఈ సినిమా చిత్రీకరణ కూడా పూర్తయింది. 'జైలర్' సినిమాకు దర్శకత్వం వహించిన నెల్సన్ దిలీప్ కుమార్ సీక్వెల్‌గా రానున్న 'జైలర్ 2' మూవీకి దర్శకత్వం వహించారు. రమ్యకృష్ణ, మిర్నా మీనన్, యోగిబాబు, మిథున్ చక్రవర్తి, ఎస్‌జే సూర్య ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రంలో మోహన్ లాల్, విజయ్ సేతుపతి, శివరాజ్ కుమార్ కీలక పాత్రల్లో నటించారని తెలిసింది. సన్ పిక్చర్స్ పతాకంపై కళానిధి మారన్ నిర్మించిన 'జైలర్ 2' చిత్రం జూన్‌లో విడుదల కానుంది. ఈ సినిమాకి అనిరుధ్ స్వరకర్త. అన్నట్లు... నోరా ఫతేహీ గురించి మన తెలుగు ఆడియన్స్‌కు ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఎందుకంటే..'బాహుబలి: ది బిగినింగ్'లో 'మనోహరి', 'టెంపర్'లో 'ఇట్టాగే రెచ్చిపోదాం పిల్లా..' ఇలా పలు స్పెషల్ సాంగ్స్‌లో నోరా నర్తించిన సంగతి గుర్తుండే ఉంటుంది.

స్పెషల్ ఎంట్రీ

టాలీవుడ్‌కి స్పెషల్ ఎంట్రీ ఇచ్చారు బాలీవుడ్ నటి మౌనీ రాయ్. చిరంజీవి హీరోగా నటించిన 'విశ్వంభర' చిత్రంలో మౌనీ రాయ్ ఓ స్పెషల్ సాంగ్ చేశారని తెలిసింది. దాదాపు వందమంది డ్యాన్సర్స్‌తో గణేష్ ఆచార్య కొరియోగ్రఫీలో ఈ పాటను చిత్రీకరించారు మేకర్స్. ఈ పాటలో చిరంజీవి, మౌనీ రాయ్ డ్యాన్స్ చేశారు. త్రిష, ఆషికా రంగనాథ్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమాకు 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వం వహించారు.

ఈ సినిమాలో చిరంజీవి చెల్లెళ్లుగా ఇషా చావ్లా, రమ్య పసుపులేటి వంటి హీరోయిన్లు నటించారని తెలిసింది. యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు. ఈ ఏడాది ద్వితీయార్ధంలో ఈ 'విశ్వంభర' సినిమా విడుదల కానుంది. ఈ సినిమాకి ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు.

మాస్ డ్యాన్స్

రామ్‌చరణ్ టైటిల్ రోల్‌లో నటించిన రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ఈ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌లో హీరో రామ్ చరణ్‌తో కలిసి శ్రుతీహాసన్ అదిరిపోయే మాస్ స్టెప్పులు వేశారు. ఈ స్పెషల్ సాంగ్‌కు కుస్తీతో కూడిన ఓ కాన్సెప్ట్ కూడా ఉందట. అంతేకాదు... ఈ సినిమా హీరోయిన్ జాన్వీ కపూర్ కూడా ఈ పాటలో కాలు కదిపారని సమాచారం. ఇదే నిజమైతే ఒకే ఫ్రేమ్‌లో చరణ్, జాన్వీ శ్రుతీహాసన్‌లను చూడటం మాస్ ఆడియన్స్‌కు థియేటర్స్‌లో విజిల్ వర్తీ మూమెంట్ అని చెప్పవచ్చు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించారు.

ఇక బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించిన ఈ చిత్రం 1970--1980 మధ్య కాలంలో సాగుతుంది. ఇందులో క్రాస్ ఓవర్ అథ్లెట్‌గా రామ్‌చరణ్ నటించారు. అంటే... ఈ చిత్రంలో రామ్‌చరణ్ క్రికెట్, కుస్తీ ఆడతారు. మరొక గేమ్ కూడా ఉంది. ఈ గేమ్‌పై త్వరలోనే స్పష్టత రానుంది. ఈ సినిమాలో శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు ఇతర ప్రధాన పాత్రల్లో నటించారు. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ పతాకాలపై వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మించిన ఈ 'పెద్ది' సినిమా జూన్ 4న విడుదల కానుంది. మరోవైపు మహేశ్‌బాబు 'ఆగడు', అర్జున్ కపూర్ 'తేవర్' చిత్రాల్లో శ్రుతీహాసన్ స్పెషల్ సాంగ్స్ చేసిన సంగతి గుర్తుండే ఉంటుంది.

ఆలియా ఆటా పాటా!

'రౌద్రం... రణం... రుధిరం' (ఆర్ఆర్ఆర్) సినిమాలో ఎన్టీఆర్, ఆలియా భట్ స్క్రీన్ షేర్ చేసుకున్నారు. ఈ ఇద్దరూ మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని తెలిసింది. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ డైరెక్షన్‌లో 'డ్రాగన్' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లుగా తెలిసింది. ఈ పీరియాడికల్ గ్యాంగ్‌స్టర్ డ్రామాలో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని సమాచారం. కాగా, ఈ సినిమాలో ఒక ప్రత్యేక పాటకు స్కోప్ ఉంది.







ఈ పాటలో నటిస్తారంటూ శ్రుతీహాసన్, రష్మికా మందన్నా, మృణాల్ ఠాకూర్ వంటి హీరోయిన్ల పేర్లు తెరపైకి వచ్చాయి. కానీ ఈ పాటలో ఆలియా భట్ కనిపిస్తారనే ప్రచారం తాజాగా తెరపైకి వచ్చింది. ఇదే నిజమైతే, 'డ్రాగన్' సినిమా కోసం ఎన్టీఆర్, ఆలియా భట్ మరోసారి స్క్రీన్ షేర్ చేసుకున్నట్లవుతుంది. ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ అంశాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. నందమూరి కల్యాణ్‌రామ్, నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా వచ్చే ఏడాది జూన్ 11న విడుదల కానుంది. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.

ది ప్యారడైజ్‌లో తమన్నా!

స్పెషల్ సాంగ్స్‌కు ఓ కేరాఫ్ అడ్రస్‌గా మారిపోయారు హీరోయిన్ తమన్నా. అంతేకాదు... ఈ బ్యూటీ ఫలానా సినిమాలో స్పెషల్ సాంగ్ చేశారంటే, ఆ సినిమా హిట్టవుతుందనే టాక్ కూడా ప్రచారంలోకి వచ్చింది. రజనీకాంత్ 'జైలర్' సినిమాలో 'కావాలయ్యా..', కావొచ్చు, హిందీ చిత్రం 'స్త్రీ 2'లో 'ఆజ్ కీ రాత్' కావొచ్చు, మహేశ్‌బాబు 'సరిలేరు నీకెవ్వరు'లో 'డాంగ్ డాంగ్..' పాట కావొచ్చు... తమన్నా స్పెషల్ సాంగ్ చేశారంటే, ఆ సినిమాకు అది తప్పకుండా ప్లస్ అవుతుంది. తాజాగా 'ది ప్యారడైజ్' చిత్రంలో ఓ స్పెషల్ సాంగ్ చేసేందుకు తమన్నా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది.

'దసరా' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత హీరో నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో రూపొందుతున్న సినిమా 'ది ప్యారడైజ్'. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామా సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ చిత్రంలో సికింద్రాబాద్ యువకుడు జడల్ పాత్రలో నాని నటిస్తున్నారు. ఈ సినిమాలో ఓ స్పెషల్ సాంగ్‌కు స్కోప్ ఉందట. దీంతో ఈ సాంగ్‌కు తమన్నా అయితే బాగుంటుందని మేకర్స్ అనుకుంటున్నారట. ఆ దిశగా సంప్రదింపులు మొదలయ్యాయని సమాచారం. అయితే ఈ 'ది ప్యారడైజ్' చిత్రంలో తమన్నా స్పెషల్ సాంగ్ చేయనున్న అంశంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

ఇక ఈ చిత్రంలో మోహన్‌బాబు, రాఘవ్ జుయల్, సంపూర్ణేష్ బాబు ఇతర లీడ్ రోల్స్ చేస్తున్నారు. ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. తొలుత ఈ సినిమాను ఈ ఏడాది మార్చి 26న రిలీజ్ చేయాలనుకున్నారు. ఈ తేదీకి విడుదల కుదరకపోవడంతో, ఈ ఏడాది ఆగస్టు 21కి వాయిదా వేశారు. అయితే ఆగస్టు 21వ తేదీన కూడా ఈ సినిమా విడుదల కాకపోవచ్చని, అనుకున్న ప్రకారం ఈ సినిమా షూటింగ్ సాగడం లేదని, రీ షూట్స్ చేయాల్సి వస్తోందనే ప్రచారం జరిగింది. కానీ అలాంటిది ఏమీ లేదని, అనుకున్న ప్రకారమే 'ది ప్యారడైజ్' సినిమా చిత్రీకరణ జరుగుతోందని, ఆగస్టు 21న ఈ సినిమా విడుదల అవుతుందని టీమ్ మరోసారి స్పష్టత ఇచ్చింది.

నేను రెడీ

టాలీవుడ్‌కు వచ్చేందుకు నేను రెడీ అన్నారు బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ. స్పెషల్ సాంగ్‌తో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చారు ఈ బ్యూటీ. హిందీలో 'హౌస్‌ఫుల్ 3, హౌస్‌ఫుల్ 5, 5 వెడ్డింగ్స్' వంటి చిత్రాల్లో నటించారు నర్గీస్. అలానే సల్మాన్ ఖాన్ 'కిక్'లో 'యార్ నా మిలే', తమిళ హీరో ప్రశాంత్ 'సాగసం'లో స్పెషల్ సాంగ్స్ చేశారు నర్గీస్. ఇప్పుడు తెలుగు సినిమాకు వచ్చారు. హవీష్, కావ్యాథాపర్ హీరో హీరోయిన్లుగా నటించిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ సినిమా 'నేను రెడీ'.

ఈ చిత్రంలోని ఓ స్పెషల్ సాంగ్‌లో డ్యాన్స్ చేశారు నర్గీస్. టాలీవుడ్‌లో నర్గీస్ చేసిన తొలి సినిమా ఇదే. హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పీ పతాకంపై త్రినాధరావు నక్కిన దర్శకత్వంలో కోనేరు సత్యనారాయణ, నిఖిల కోనేరు నిర్మించిన ఈ చిత్రం జూన్ రెండో వారంలో విడుదల కానుంది. బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిశోర్, మురళీ శర్మ, వీటీవీ గణేష్, గోపరాజు రమణ, హరితేజ, మహతి ఇతర కీలక పాత్రల్లో నటించిన ఈ 'నేను రెడీ' సినిమాకు మిక్కీ జే మేయర్ సంగీతం అందిస్తున్నారు.

అలాగే 'నేను రెడీ' సినిమా విడుదల కాకముందే, తెలుగులో ఇంకో సినిమాలో మరో స్పెషల్ సాంగ్ చేసే అవకాశాన్ని దక్కించుకున్నారట నర్గీస్. 'వీరసింహారెడ్డి' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో బాలకృష్ణ, దర్శకుడు గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్నారని తెలిసింది. ముంబై నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమాలోని ఓ స్పెషల్ సాంగ్‌లో నర్గీస్ ఫక్రీ డ్యాన్స్ చేశారని తెలిసింది. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కావొచ్చు.

బ్లాక్ గోల్డ్‌లో సీరత్ ... ఉమెన్ సెంట్రిక్ సినిమాల్లో అరుదుగా ప్రత్యేక పాటలు చూస్తుంటాం. హీరోయిన్ సంయుక్త నటించిన తొలి ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'ది బ్లాక్‌గోల్డ్'. తెలంగాణ -- మహారాష్ట్ర సరిహద్దులోని బొగ్గు గనుల నేపథ్యంలో సాగే ఈ సినిమాను కేవీఎంసీ యోగేష్ దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించారు. ఈ సినిమాలో పోలీస్ ఆఫీసర్‌గా నటించారు సంయుక్త. దేశాన్ని కుదిపేసిన కోల్ సిండికేట్‌ల బ్యాక్‌డ్రాప్‌లో నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో తెరకెక్కిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ చిత్రంలో హీరోయిన్ సీరత్ కపూర్ స్పెషల్ సాంగ్ చేశారని తెలిసింది. ఈ సినిమా ప్రమోషన్స్ సమయంలో ఈ పాటను రిలీజ్ చేయాలనుకుంటున్నారట మేకర్స్. ఈ సంగతి ఇలా ఉంచితే.. కె. విజయభాస్కర్ దర్శకత్వంలో శ్రీకమల్, తన్వీ లీడ్ రోల్స్‌లో నటించిన 'ఉషా పరిణయం' (2024) చిత్రంలో సీరత్ కపూర్ ప్రత్యేక పాటలో మెరిశారు. ఇక శర్వానంద్ 'రన్ రాజా రన్'లో హీరోయిన్‌గా నటించిన సీరత్ కపూర్ నాగార్జున 'రాజుగారి గది 2', అల్లు శిరీష్ 'ఒక్క క్షణం', రవితేజ 'టచ్ చేసి చూడు' వంటి చిత్రాల్లో కీ రోల్స్ చేసిన సంగతి తెలిసిందే. ఇంకా మరికొందరు తారలు స్పెషల్ సాంగ్స్ చేసేందుకు రెడీ అవుతున్నారని తెలిసింది.

## శరీరంలో రక్త సరఫరా సరిగ్గా లేకపోతే కనిపించే లక్షణాలు ఇవే..

# ఈ ఆహారాలను తినాలి..!



మన శరీరంలో అన్ని భాగాలకు, కణాలకు ఆక్సిజన్, పోషకాలు సరిగ్గా రవాణా అయ్యేందుకు గాను రక్త సరఫరా వ్యవస్థ నిరంతరాయంగా పనిచేస్తూనే ఉంటుంది. రక్త సరఫరా సరిగ్గా ఉంటేనే అన్ని భాగాలకు పోషకాలు, ఆక్సిజన్ లభిస్తాయి. దీంతో మనం ఆరోగ్యంగా ఉంటాం. అయితే కొన్ని రకాల కారణాల వల్ల కొందరిలో రక్త సరఫరా సరిగ్గా ఉండదు. దీంతో పలు వ్యాధులు వస్తుంటాయి. పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ అనే వ్యాధి ఉన్నవారిలో, డయాబెటిస్ ఉన్నా, అధికంగా బరువు ఉన్నవారిలో, పొగ తాగేవారిలో, డీప్ వీన్ థ్రాంబోసిస్ (డీవీటీ) అనే సమస్య ఉన్నవారిలో, క్రానిక్ వీనస్ ఇన్‌సఫిషియెన్సీ (సీవీఐ) అనే సమస్య ఉన్నవారిలో రక్త సరఫరా సరిగ్గా ఉండదు. అలాగే నిత్యం గంటల తరబడి ఒకే చోట కూర్చుని పనిచేసేవారు, బీపీ, కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారిలో కూడా రక్త సరఫరా సక్రమంగా ఉండదు.

### రక్త సరిగ్గా లేకపోతే కనిపించే లక్షణాలు..

రక్త సరఫరా సరిగ్గా లేకపోతే మన శరీరం పలు లక్షణాలను, సంకేతాలను తెలియజేస్తుంది. చేతులు, పాదాల్లో స్పర్శ లేనట్లు అనిపిస్తుంది. కొన్ని సార్లు ఆయా భాగాల్లో సూదులతో గుచ్చినట్లు కూడా అనిపిస్తుంది. పాదాలు, మడమలు వాపులకు గురవుతాయి. వేలితో నొక్కితే సొట్ట పడుతుంది. తరచూ కండరాల నొప్పులు ఉంటాయి. ముఖ్యంగా రాత్రి పూట కాలి పిక్కలు తరచూ పట్టుకుపోతుంటాయి. రక్త సరఫరా సక్రమంగా లేనివారి శరీరం మొత్తం పాలిపోయినట్లు కనిపిస్తుంది. కళ ఉండదు. గాయాలు, పుండ్లు నెమ్మదిగా మానుతాయి. తీవ్రమైన అలసట, నీరసం ఉంటాయి. జుట్టు రాలిపోతుంది. కాళ్లు, చేతులపై ఉండే వెంట్రుకలు కూడా బాగా రాలిపోతుంటాయి. ఇవన్నీ శరీరంలో రక్త సరఫరా సక్రమంగా జరగడం లేదని తెలియజేసే లక్షణాలు.

### ప్రాణాంతకం కావచ్చు..

శరీరంలో రక్త సరఫరా సక్రమంగా సరిగ్గా ఉండకపోతే దీర్ఘకాలంలో పలు అనారోగ్య సమస్యలు వస్తాయి. ముఖ్యంగా రక్త నాళాల్లో బ్లడ్ క్లాట్స్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది. దీని వల్ల హార్ట్ ఎటాక్ వస్తుంది. సాధారణంగా దీన్ని కనిపెట్టలేరు. కానీ పైన తెలిపిన లక్షణాలు కనిపిస్తే మాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్‌ను కలిసి పరీక్షలు చేయించుకోవాలి. ఏదైనా సమస్య ఉన్నట్లు తేలితే వెంటనే చికిత్స తీసుకోవాలి. రక్త సరఫరా సక్రమంగా లేని వారికి డాక్టర్లు మందులను సూచిస్తారు. వాటిని క్రమం తప్పకుండా వాడాల్సి ఉంటుంది. అలాగే రోజూ తప్పనిసరిగా 30 నిమిషాల పాటు వ్యాయామం చేయాలి. వేళకు భోజనం చేయాలి. నిద్రపోవాలి. రోజుకు తగినంత మోతాదులో నీళ్లను కూడా తాగాల్సి ఉంటుంది. అలాగే ఆహారం విషయంలోనూ పలు మార్పులు చేసుకోవాలి. దీని వల్ల ఈ సమస్య నుంచి బయట పడవచ్చు.

### ఈ ఆహారాలను తినాలి..

రక్త సరఫరా సక్రమంగా లేని వారు కచ్చితమైన డైట్‌ను పాటించాల్సి ఉంటుంది. దీంతో ప్రాణాంతక పరిస్థితులు రాకుండా నివారించవచ్చు. ముఖ్యంగా బీట్ రూట్, పాలకూర, చేపలు, వాల్ నట్స్, అవిసె గింజలు వంటి ఆహారాలను తింటుండాలి. వీటిల్లో అనేక సమ్మేళనాలతోపాటు ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి రక్త నాళాలను ఆరోగ్యంగా ఉంచుతాయి. రక్త సరఫరా మెరుగు పడేలా చేస్తాయి. అలాగే ఫ్లేవనాయిడ్స్ అధికంగా ఉండే స్ట్రాబెర్రీలు, క్రాన్ బెర్రీలు, రాస్ప్ బెర్రీలను తింటున్నా కూడా ఉపయోగం ఉంటుంది. సిట్రస్ జాతికి చెందిన నిమ్మ, నారింజ వంటి పండ్లు కూడా మేలు చేస్తాయి. డార్క్ చాక్లెట్, వెల్లుల్లి, క్యాప్సికం, పసుపు వంటి ఆహారాలను తింటున్నా కూడా సమస్య తగ్గుతుంది. ఇలా రక్త సరఫరాను మెరుగు పరుచుకుని గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.

## వెనక్కు తిరిగి చూసుకుంటే..

# అదే నా లక్ష్యం



మలయాళం, తమిళ, తెలుగు భాషల్లో నటిస్తూ క్రేజీ కథానాయికగా రాణిస్తోంది హీరోయిన్ మమితా బైజు. మలయాళంలో నటించిన ప్రేమలు చిత్రంతో అందరి దృష్టిని తనవైపు ఆకర్షించింది. ఆ తర్వాత కోలీవుడ్, టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి దక్షిణాదిలో ట్రెండింగ్ హీరోయిన్‌గా వెలుగొందుతోంది. ఇటీవల డ్యూడ్ మూవీతో మరో సక్సెస్‌ను తన ఖాతాలో వేసుకున్న ఈ బ్యూటీ ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో బిజీగా ఉంది. ఈమె విజయ్‌తో కలిసి నటించిన జననాయకన్ (తెలుగులో జన నాయకుడు) చిత్రం త్వరలో తెరపైకి రావడానికి సిద్ధమవుతోంది.

అదే నా లక్ష్యం

అలాగే సూర్యకు జంటగా నటించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇకపోతే అశోక్ సెల్వన్‌కు జంటగా నటించిన ఇరండు విధానం చిత్రం కూడా విడుదలకు రెడీ అవుతోంది. ఈ చిత్రాలు విడుదలైన తర్వాత మమితా బైజు క్రేజ్ వేరేగా ఉంటుందని భావించవచ్చు. ఇటీవల ఈ అమ్మడు ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'నా అభిమానుల గుండెల్లో నిలిచిపోయే చిత్రాలను చేయాలన్నదే నా లక్ష్యం. అలా ఒక ప్రేమైక కుటుంబాన్ని తయారు చేసుకోవాలని కోరుకుంటున్నాను. ఇకపోతే ఏదో ఒక రోజున నా జరిగిన కాలం గుర్తుకు వస్తే ఆనందం కలగాలి. అందుకోసమే నా ఈ ప్రయాణం' అని మమిత పేర్కొంది.

# ఘోస్ట్ బర్డ్... సీజన్ కో రంగు మార్చుతుంది!









ఉత్తర అమెరికా పర్వతాల్లో కనిపించే వైట్-టైల్డ్ టార్మిగాన్ పక్షి

రుతువులకు అనుగుణంగా రంగులు మార్చుకోవడం దీని ప్రత్యేకత

శీతాకాలంలో మంచులో కలిసిపోయేలా పూర్తిగా తెల్లగా మారడం

వేసవిలో రాళ్లలో దాక్కునేలా బూడిద రంగులోకి మార్పు

మంచులో నడిచేందుకు సాయపడే ఈకలతో నిండిన కాళ్లు







ప్రకృతిలో జీవరాశుల మనుగడ ఎన్నో అద్భుతాలకు, వింతలకు నిలయం. పరిసరాలకు అనుగుణంగా తమను తాము మార్చుకుంటూ జీవించే ఎన్నో జీవులు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. ఈ కోవకే చెందింది వైట్-టైల్డ్ టార్మిగాన్ (ఔహ్ఘ్ఏఅ్ష్ఠుఎఅశ్రీవఎ ౯ఉతీఎఅస్త్రుఅ) అనే చిన్న పక్షి. ఉత్తర అమెరికాలోని ఎత్తైన పర్వత ప్రాంతాల్లో నివసించే ఈ పక్షి, రుతువులకు అనుగుణంగా తన రంగును పూర్తిగా మార్చుకోగలదు. శీతాకాలంలో ఈ పక్షి శరీరం మొత్తం మంచులా స్వచ్ఛమైన తెలుపు రంగులోకి మారిపోతుంది. దీనివల్ల మంచుతో కప్పబడిన పరిసరాల్లో శత్రువుల కంట పడకుండా సులభంగా కలిసిపోతుంది. అదే వేసవి, వసంత కాలాల్లో దీని ఈకలు బూడిద, గోధుమ రంగు మచ్చలతో విభిన్నంగా ఉంటాయి. ఇది రాళ్లు, టండ్రా నేలపై సులభంగా దాక్కోవడానికి సహాయపడుతుంది. ఈ అద్భుతమైన అనుసరణే దీని మనుగడకు కీలకం. సుమారు అర కిలో బరువుండే ఈ పక్షి తోక ఎప్పుడూ తెల్లగానే ఉంటుంది. అందుకే దీనికి "వైట్-టెయిల్డ్" అనే పేరు వచ్చింది. దీని కాళ్లపై దట్టమైన ఈకలు ఉండి, "స్నో ప్యాంట్స్" లాగా చలి నుంచి రక్షణ కల్పిస్తాయి. అంతేకాకుండా, మంచు మీద తేలికగా నడిచేందుకు "స్నోషూస్" లాగా కూడా ఉపయోగపడతాయి. చాలా నిశ్శబ్దంగా, అప్రమత్తంగా ఉండటం వల్ల దీనిని 'ఘోస్ట్ బర్డ్' అని కూడా పిలుస్తుంటారు. ప్రస్తుతం ఈ పక్షి జాతికి ఎలాంటి ప్రమాదం లేదని ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్) స్పష్టం చేసింది.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .